# ఉపాధ్యాయులకు సూచనలు (తెలుగు)

- ❖ సంసిద్ధతా కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యము పిల్లలందరూ ధారాళంగా చదవడం. రాయగలగడం.
- ❖ ఈ కార్యక్రమములో మొదటిగా పిల్లల స్థాయిని నిర్ధారణ చేసుకోవాలి.
- ❖ సమ్మేటివ్ -3 ఆధారంగా పిల్లల స్థాయిని నిర్ధారణ చేసి సంబంధిత రిజిష్టర్‌లో నమోదు చేసుకోవాలి.
- ❖ విద్యార్థులను జట్లుగా విభజించుకోవాలి.
- ❖ విద్యార్థుల సంఖ్యను బట్టి ఒక్కొక్క జట్టులోకి 3 లేదా 4 గురు విద్యార్థులు ఉండేలా చూసుకోవాలి.
- ❖ ప్రతి జట్టులో సాధ్యమమైనంత వరకు అన్ని స్థాయిల (A+, A, B+, B, C) పిల్లలు ఉండేలా చూడాలి.
- ❖ కనీస స్థాయి (చదవడం, రాయడంలో వెనుకబడిన) లేని పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- ❖ A+, A గ్రేడు సాధించిన విద్యార్థులను జట్లలో సహాయకారిగా ఉపయోగిస్తూనే, వారికి అదనపు కృత్యాలను కూడా కల్పించాలి.
- ❖ A+, A గ్రేడు పిల్లలకు ఇచ్చే అదనపు కృత్యాలను ఉపాధ్యాయులు స్వయంగా గాని, పాఠ్యపుస్తకములోని కృత్యాల నుండి గాని ఇవ్వాలి.
- ❖ ప్రతి రోజు పిల్లల చేత అదనపు కృత్యాలను ఇంటి పనిగా చేయించాలి.
- ❖ ప్రతి రోజు పిల్లల చేసిన ఇంటి పనిని ఉపాధ్యాయుడు పరిశీలించి, సరిదిద్దాలి. తగిన సూచనలు ఇవ్వాలి.
- ❖ సంసిద్ధతా కార్యక్రమానికి అవసరమయ్యే సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవాలి. అవసరమైన సందర్భాలలో వినియోగించుకోవాలి.
- ❖ సంసిద్ధతా కార్యక్రమం ఆరంభంలోనే ప్రతి విద్యార్థి చేత ఒక నోటుపుస్తకం పెట్టించాలి.
- ❖ రోజు వారీ కృత్యాలను ఉపాధ్యాయులు నల్లబల్లపై రాసి, వివరించి విద్యార్థులచే జట్లలో చేయించాలి. వాటిని ప్రతి విద్యార్థి తమ నోటుపుస్తకంలో రాసేలా శ్రద్ధ తీసుకోవాలి.
- ❖ చిత్రాలతో కూడిన కృత్యాలను ముందుగా సిద్ధం చేసుకున్న చిత్రాలను చార్టుపై అతికించి గానీ, ఫ్లాష్ కార్డుల ద్వారం గానీ లేదా నల్లబల్లపై గీసి గానీ నిర్వహించాలి.

# పాఠశాల సంసిద్ధత కార్యక్రమం - 15 రోజుల కాలనిర్ణయ పట్టిక

| వ. సం | గేయాలు / పాటలు / పద్యాలు | కథలు | సృజనాత్మక కృత్యాలు | ఆటలు |
|---|---|---|---|---|
| 1వ రోజు | చిట్టి చిలకమ్మా | అనగనగా ఒక చీమ | మట్టితో బొమ్మలు, నమూనాల తయారీ | బంతిని తప్పించుకోవడం |
| 2వ రోజు | గాంధీజీ - చాచాజీ | పిల్లి మెడలో గంట | రబ్బరు బూరల్లో గాలి ఊదడం | ఉఫ్ ఆట |
| 3వ రోజు | పెద్దది - చిన్నది | సింహం -చిట్టెలుక | కాగితాలను వివిధ ఆకారాల్లో చింపడం | తాడు లాగడం |
| 4వ రోజు | చిన్ని కృష్ణుడు | పెన్సిల్ తెలివి | బొమ్మల కొలువు | గీతమీద నడవడం |
| 5వ రోజు | ఇష్టం | పాయసం తాగిన కుందేలు | రంగులద్దడం | కప్పగంతులు |
| 6వ రోజు | వానలు - వానలు | పాపం ఈగ | అట్టముక్కలతో ఇళ్ల నిర్మాణం | ఈత ఆట |
| 7వ రోజు | ఏనుగు | పొట్ట పగిలిన చిక్కుడు కాయ | వివిధ ఆకారాలను గీయడం | ముక్కు గిల్లి పోయే ఆట |
| 8వ రోజు | పండుగ | నాన్నా! పులి!! | ఫ్యాన్సీ డ్రస్ | కర్చీఫ్ ఆట |
| 9వ రోజు | అమ్మ - నిమ్మ | పుచ్చకాయల పరుగు పందెం | గుర్తించండి - గీయండి | ఢాం.. ఢాం.. బెలూన్ |
| 10వ రోజు | అంకెల పాట | అపాయంలో ఉపాయం | సబ్బునీటితో బుడగలు | గురి చూసి విసరడం |
| 11వ రోజు | చెమ్మ చెక్క | ఉప్పు సముద్రం | వేరు చేయడం | ఇడ్లీ - కాఫీ - పూరి |
| 12 వ రోజు | బుడుగు | ఆవు - కోడి -గొర్రె | వాహనాల అనుకరణ | కనుక్కోండి చూద్దాం |
| 13వ రోజు | వేమన పద్యం | ఎలుక - టోపి | దుకాణాలు - అనుకరణ | బొమ్మ ప్రాణం |
| 14వ రోజు | వేమన పద్యం | మునక్కాయంత ముసలమ్మ | డాన్స్ | పరిమాణాల్ని గుర్తించడం |
| 15వ రోజు | వేమన పద్యం | చెరపకురా చెడేవు | ఇంద్ర ధనస్సు | తలపై పుస్తకం / చెంచాలో గోళీ |

# పాఠశాల సంసిద్ధత కార్యక్రమం

## గేయాలు, పద్యాలు, అభినయ గేయాలు పాడించడానికి సూచనలు

- ఉపాధ్యాయుడు ముందుగా అభినయ గేయం చదవాలి.
- ఉపాధ్యాయుడు అభినయంతో గేయాన్ని పాడి వినిపించాలి.
- విద్యార్థులందరితో ముందుగా పాడించాలి, తరువాత అభినయం చేస్తూ పాడించాలి.
- ఉపాధ్యాయుడు, విద్యార్థులు అభినయిస్తూ కలిసి పాడాలి.
- విద్యార్థులు మాత్రమే అభినయంతో గేయాన్ని పాడి వినిపించేలా కృషి చేయాలి.
- ఇందులో అదనపుగేయాలు చేర్చడమైనది, వీలైతే వాటిని కూడా నేర్పండి.
- వీటితో పాటు మీకందుబాటులో ఉన్న గేయాలను, స్థానికంగా ప్రాచుర్యం పొందిన గేయాలను కూడా పిల్లలకు నేర్పండి.

## 1వ రోజు - చిట్టి చిలుకమ్మ

చిట్టి చిలకమ్మ
అమ్మ కొట్టిందా
తోట కెళ్లావా
పండు తెచ్చావా
గూట్లో పెట్టావా
గుటుక్కు మింగావా!

## 2వ రోజు - గాంధీజీ - చాచాజీ

అందరితాత గాంధీజీ
పిల్లల చాచా నెహ్రూజీ
అందమైనదీ మా దేశం
భారత దేశం మా దేశం

## 3వ రోజు - పెద్దది - చిన్నది

మఱ్ఱిచెట్టు పెద్దది
మఱ్ఱిపండు చిన్నది
చింత చెట్టు పెద్దది
చింత కాయ చిన్నది
మఱ్ఱి పండు వద్దులే
చింతకాయ చాలులే!

## 4వరోజు - చిన్ని కృష్ణుడు

చేత వెన్నముద్ద
చెంగల్వ పూదండ
బంగారు మొలతాడు పట్టుదట్టి
సంది తాయెత్తుల
సరిమువ్వ గజ్జెల
చిన్ని కృష్ణా నిన్ను చేరికొలుతు!

## 5వ రోజు - ఇష్టం

బంతి పువ్వు భారతి కిష్టం
చేమంతి పువ్వు చెల్లాయి కిష్టం
తామర పువ్వు తమ్ముడి కిష్టం
మందార పువ్వు అక్కకు ఇష్టం

### 6వ రోజు - వానలు - వానలు

వానలు వానలు వచ్చాయి
చెఱువులు బాగా నిండాయి
కప్పలు చాలా వచ్చాయి
బెక బెక మంటూ అరిచాయి!

### 7వ రోజు - ఏనుగు

ఏనుగమ్మా ఏనుగు
ఎంతో చక్కని ఏనుగు
నాలుగు కాళ్ల ఏనుగు
చిన్న తోక ఏనుగు
చేట చెవుల ఏనుగు
తెల్ల కొమ్ముల ఏనుగు
బారెడు తొండం ఏనుగు

### 8వ రోజు - పండుగ

దసరా పండుగ వచ్చింది
సరదాలెన్నో తెచ్చింది
దీపావళి పండుగ వచ్చింది
టపాకాయలు తెచ్చింది
సంక్రాంతి పండుగ వచ్చింది
కొత్త బట్టలు తెచ్చింది.

### 9వ రోజు - అమ్మ - నిమ్మ

అమ్మ నాటిన మొక్క అది నిమ్మ మొక్క
నాన్న నాటిన మొక్క నారింజ మొక్క
అక్క నాటిన మొక్క అది అరటిమొక్క
నేను నాటిన మొక్క నేరేడు మొక్క

### 10వ రోజు - అంకెల పాట

ఒకటి రెండు - ఒప్పుల కుప్ప
మూడు నాలుగు - ముద్దులగుమ్మ
ఐదు ఆరు - అందాల భరిణె
ఏడు ఏనిమిది - వయ్యారి భామ
తొమ్మిది, పది - బంగారు బొమ్మ

## 11వ రోజు - చెమ్మ చెక్క

చెమ్మ చెక్క చారడేసి మొగ్గ
అట్లు పోయంగ ఆరగించంగా
పగడాల చెమ్మచెక్క పందిరేయంగా
రత్నాల చెమ్మచెక్క రంగులేయంగా
సుబ్బరాయుడి పెళ్లి చూసొద్దాం రండి
మా ఇంట్లో పెళ్లి మళ్లీ వద్దాం రండి

## 12వ రోజు - బుడుగు

అదిగదిగో బుడుగు
అల్లరి చేసే పిడుగు
బుడుగు చొక్కా తొడిగాడు
గొట్టం పాంటు వేసాడు
తాత కర్ర తెచ్చాడు
కుక్కని కొట్టి ఉరికాడు
అరటి తొక్క తొక్కాడు
జర్రున జారి పడ్డాడు.

## 13వ రోజు - వేమన పద్యం

ఉప్పు కప్పురంబు ఒక్క పోలికనుండు
చూడ చూడ రుచుల జాడ వేరు
పురుషులందు పుణ్యపురుషులు వేరయా
విశ్వదాభిరామ వినుర వేమ!

## 14వ రోజు - వేమన పద్యం

తల్లిదండ్రులందు దయలేని పుత్రుడు
పుట్టనేమి వాడు గిట్టనేమి
పుట్టలోన చెదలు పుట్టదా గిట్టదా
విశ్వదాభిరామ వినుర వేమ!

## 15వ రోజు - వేమన పద్యం

అనువుగాని చోట అధికులు మనరాదు
కొంచెమైన అదియు కొదువ గాదు
కొండ అద్దమందు కొంచెమై యుండదా
విశ్వదాభిరామ వినుర వేమ!

## 16 బూరలు

గాలి ఊదితే ఉబ్బే బూరలు
గాలికి రెప రెపలాడే బూరలు
గాలికి పై పై కెగిరే బూరలు
ఠప్ ఠప్ మంటూ పేలే బూరలు
రంగు  రంగుల బూరలు బూరలు
రంగుల రబ్బరు బూరలు బూరలు!

## 17 కోడి పుంజూ

కొక్కొరకో అన్నది - కోడి పుంజు
కొండెక్కి పోయింది - కోడి పుంజు
కొండమీద ఉన్నది - గుండు నక్క
కడుపు నిండ తిన్నది - ఏంచక్కా!

## 18 దేశభక్తి గేయం

కొత్త కొత్త రాగాలను
పలుకుతాము మేము
భరతమాత బిడ్డలుగా
వెలుగుతాము మేము
భరతమాతను అందంగా
తీర్చిదిద్దుతాము
ఆమె ముఖం నిండ వెలుగు
నింపుతాము మేము!

## 19 ఊరపిచ్చుక

ఊరంతా తిరిగింది ఊరపిచ్చుక
ఉల్లిపాయ తెచ్చింది ఊరపిచ్చుక
కల్లాపి వేసింది ఊరపిచ్చుక
తెల్ల ముగ్గు పెట్టింది ఊరపిచ్చుక
తాలింపు వేసింది ఊరపిచ్చుక
తుమ్మ లేక బయటి కొచ్చె ఊరపిచ్చుక!

## 20 ఏ ఊరు

కాకి కాకి ఏ ఊరు? కాకినాడ మా ఊరు
చిలుక చిలుక ఏ ఊరు? చిక్కడపల్లి మా ఊరు
పిచ్చుక పిచ్చుక ఏ ఊరు? పిఠాపురము మా ఊరు
కొంగా కొంగా ఏ ఊరు? కోటిపల్లి మా ఊరు.

# RHYMES

## (3rd day)

1. Twinkle Twinkle Little Star
How I wonder what you are?
Up above the world so high
Like a diamond. In the sky

2. "Johny", "Johny"
"Yes Papa"
"Eating sugar"?
"No papa"
"Telling lies"
"No papa"
"Open your mouth"
ha . . . . ha . . . . ha . . . .

3. Jack and Jill
went up the hill
To fetch a pail of water
Jack fell down and Broke his crown
and Jill came tumbling after

4. Ding dong bell
pussy's in the well,
who put her in?
Little Tommy thin
Who pulled her out?
Little Tommy Stout

5. Roses are Red
Violets are blue
Honey is sweet and
so are you . . . . .

6. Rain on the green grass,
Rain on the tree
Rain on the house top
But not upon me

7. My kite's in the sky
It's flying so high
And looking so gay . . . .
But it's flying away.

8. Hickory, Dickory dock
The mouse ran up the clock
The clock struck one
The mouse ran down
Hickory, Dickory - - - - - Dock.

9. Pussy cat, Pussy cat . . . . . . .
"Where have you been?
I have been to London _ _ _ _ _
to look at the Queen _ _ _ _ _
Pussy Cat, Pussy Cat _ _ _ _ _
What did you do there?
I frightened a little mouse
Under her chair _ _ _ _ _

10 Are you sleeping?
Are you sleeping?
Brother John _ _ _ _ _
Brother John _ _ _ _ _
Morning bells are ringing _ _ _ _ _
Morning bells are ringing _ _ _ _ _
Ding dong bell _ _ _ _ _
Ding dong bell _ _ _ _ _

# కథలు - సూచనలు

- ఉపాధ్యాయుడు ముందుగానే కథను చదివి, అర్థంచేసుకుని, జ్ఞాపకముంచు కోవాలి.
- తరువాత పిల్లలందరినీ తనచుట్టూ అర్థవృత్తాకారం / వృత్తాకారంలో కూర్చోబెట్టుకుని తగిన హావభావాలతో, సందర్భోచితమైన కంఠస్వరంతో కథను ఆసక్తికరంగా, రక్తికట్టించేలా చెప్పాలి.
- పాత్రల సంభాషణలను ఆయా ప్రాంతాల స్థానికయాసలోనే చెప్పాలి.
- కథలలో జరగనున్న విషయాలను పిల్లలతో ఊహింపజేస్తూ, వాళ్ళను మాట్లాడిస్తూ వారిఊహాశక్తిని పెంపొందించడానికి ప్రయత్నించాలి.
- కథ చెప్పడం అయిన తర్వాత అందులో వచ్చిన పాత్రల గురించి, సంభాషణల గురించి, సన్నివేశాల గురించి చిన్న చిన్న ప్రశ్నల ద్వారా పిల్లలతో మాట్లాడించాలి.
- కథను తమ సొంత మాటల్లో తిరిగి చెప్పేలా పిల్లలను ప్రోత్సహించాలి.
- వీటికి అదనంగా మీ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన ఆసక్తికరమైన కథల్ని కూడా చెప్పవచ్చు.

1. అనగనగా ఒక చీమ
2. పిల్లి మెడలో గంట
3. సింహము - చిట్టెలుక
4. పెన్సిలు తెలివి
5. పాయసం తాగిన కుందేలు
6. పాపం ఈగ!
7. పొట్ట పగిలిన చిక్కుడు కాయ
8. నాన్నా పులి.....!
9. పుచ్చకాయల పరుగు పందెం
10. అపాయంలో ఉపాయం
11. ఉప్పు సముద్రం
12. ఆవు - కోడి - గొర్రె
13. ఎలుక - టోపి
14. ములక్కాయంత ముసలమ్మ కథ
15. చెరపకురా చెడేవు (గేయ కథ)

## 1. అనగనగా ఒక చీమ

అనగనగా ఒక చీమ. దానికొకరోజు చీరకట్టుకోవాలనిపించింది. అమ్మ చీమ దగ్గరకు పోయి "అమ్మా అమ్మా! నేను చీరకట్టుకుంటానే" అంది. అప్పుడు అమ్మ పెద్దగా నవ్వింది. పిల్ల చీమ సిగ్గుపడింది. "ఛీ! నువ్విట్టా ఎగతాళి చేస్తావనే నీ కసలు చెప్పనిది!" అని పుట్టలోంచి తుర్రుమని బయటకొచ్చింది. అక్కడొక తూనీగ కనపడింది. "అక్కా అక్కా ... నీ చీర ఇవ్వవా ఒకరోజు కట్టుకుంటాను" అంది. తూనీగ పకాపకా నవ్వింది. చీమకు మళ్ళీ సిగ్గొచ్చింది. కోపం కూడా వచ్చింది. "ఎందుకు వీళ్ళంతా ఇట్టా నవ్వుతారు. నేను చక్కగా చీర కట్టుకుంటానంటే" అనుకుంది. అనుకుని అలా దారెంబడి వెళ్తూ ఉంటే దేవస్థానం ఏనుగు కనబడి చీమను పలకరించింది. "ఏంటి చీమ పిల్లా! బుంగమూతి పెట్టావ్? ఎక్కడికెళ్తున్నావేంటి?" అని అడిగింది. చీమ తల పైకెత్తి ఏనుగు వైపు చూస్తూ "ఏనుగత్తా ఏనుగత్తా... మరే నీ కర్చీఫ్ ఇవ్వవానాకు" అని అడిగింది. "ఎందుకు" అంది ఏనుగు. "చెబుతాన్లేగానీ నవ్వకూడదు". ఏనుగుకు నవ్వొచ్చిందిగానీ ఆపుకుని "నవ్వనులే చెప్పు" అంది. "నవ్వావనుకో.. గట్టిగా కుడతామరి" అని భయపెట్టింది చీమ. "అమ్మో కుడతావా" అని భయం నటించింది ఏనుగు. "సరే నవ్వన్లే చెప్పు" అంది. "చీర కట్టుకుందామనత్తా" అని చెప్పింది చీమ సిగ్గుపడుతూ. ఏనుగు నవ్వుతూ "ఇదిగో తీసుకో" అని కర్చీఫ్ చూపించింది. ఆ కర్చీఫ్ చూస్తే చీమకు మతిపోయింది "ఏంటత్తా నీ కర్చీఫ్ ఊరంత పెద్దగా ఉంది. ఇది నేనెట్లా కట్టుకుంటాను! నాకు చీరా వద్దు పాడూవద్దు లేమ్మా. కమ్మగా గాలాడుతూ ఉంటుంది. నేనిట్లాగే తిరుగుతాన్లే" అని పుట్టకి బయలుదేరింది చీమ.

## 2. పిల్లి మెడలో గంట

అనగనగా ఒక వీధి. ఆ వీధిలో ఒక పెద్ద గండు పిల్లి ఉంది. ఆ వీధిలో ఉన్న ఎలుకలను రోజూ అది పట్టి తినేస్తూ ఉన్నది. ఎలుకలన్నీ కలిసి ఈ పిల్లి బెడద నుంచి ఎలా తప్పించుకోవాలా అని ఆలోచించాయి. చివరకు ఒక ఉపాయం పన్నాయి. పిల్లిని పిలుచుకొచ్చి బాగా పొగిడి, బహుమతిగా దాని మెడలో ఒక గంట కడితే అదివస్తూ ఉంటే గంట మోగితే పిల్లి వచ్చే విషయం తమకు తెలిసిపోతుందనీ, తాము తప్పుకోవచ్చనీ అనుకున్నాయి. అయితే

'పిల్లిమెడలో గంట కట్టేదెవరు?' అనేదే పెద్ద సమస్య అయి కూర్చుంది.ఏ ఎలుకకు మాత్రం ఆ ధైర్యం ఉంటుంది?

చివరకు ఈ ఎలుకలన్నీ కలిసి ఒక కుక్క దగ్గరకు వెళ్ళి సాయం చేయమని అడిగాయి. విషయమంతా వివరించాయి. కుక్క వెళ్ళి పిల్లితో బహుమతి విషయం చెప్పగానే బుర్రలేని ఆ పిల్లి భలే సంతోషించింది. "ఆహా! నేను చక్కగా అందంగా తెల్లగా ఉన్నానని నాకు ఈ బహుమతి ఇస్తున్నారు గదా...." అనుకుని మురిసిపోయింది. అంతా ఎలుకలు అనుకున్నట్లే జరిగిపోయింది.

తనమెడలో గణగణా మోగుతున్న కొత్త గంటను చూసుకుని పిల్లి సంతోషించింది. కానీ పాపం .... ఆరోజు నుంచీ దానికి ఒక్క ఎలుక దొరికితే ఒట్టు! ఎందుకో చెప్పుకోండి చూద్దాం!!

## 3. సింహము - చిట్టెలుక

అనగనగా ఒక అడవి. అందులో ఒక సింహం. ఒకరోజ అది కడుపునిండా మాంసం తిని ఒకచెట్టుకింద గుర్రుపెట్టి నిద్రపోతుంది. ఆ దగ్గరలో ఆడుకుంటున్న ఒక ఎలుకకు సింహం జూలును చూస్తే భలే నవ్వొచ్చింది. గాలికి అటూ ఇటూ ఊగుతున్న జూలును చూసి "భలేభలే" అనుకుంది. మెల్లగా సింహం దగ్గరకు వెళ్ళి దానిమీదకు ఎక్కి జూలుతో ఆడుకోవడం మొదలుపెట్టింది. అంతలో ఎలుకకు తుమ్మువచ్చింది. 'ఖీచ్'మని తుమ్మింది. ఆ చప్పుడుకు సింహం ఉలిక్కిపడిలేచింది. ఎలుకను పట్టుకుని తినబోయింది. ఎలుక వలవలా ఏడ్చింది. తనను వదిలిపెట్టమని సింహాన్ని బతిమిలాడింది. ఎప్పుడైనా సాయం చేస్తానంది. "నువ్వునాకు సాయం చేస్తావా..." అంటూ సింహం నవ్వి ఎలుకను వదలివేసింది.

ఒకసారి సింహం వేటగాడి వలలో చిక్కింది. అటుగా పోతున్న ఎలుక ఇది చూసి వలను కొరికివేసి సింహాన్ని విడిపించింది. ఎలుక చేసిన సాయానికి సింహం సంతోషించింది. అప్పటినుండీ సింహమూ-చిట్టెలుకా కలిసి స్నేహంగా ఉన్నాయి.

## 4. పెన్సిలు తెలివి

అనగనగా ఒక ఇల్లు. ఒకరోజు రాత్రిపూట ఆ ఇంట్లోకి ఒక ఎలుకవచ్చింది. ఏం తిందామా అని ఇల్లంతా వెతుకుతుంటే పెన్సిలు కనపడింది. పెన్సిలుని కొరకబోయింది ఎలుక అంతలో "ఎలుకక్కా ఎలుకక్కా ....." అని వినబడింది. 'ఎవరబ్బా.. నన్ను అక్కా అని పిలిచేవాళ్ళిక్కడ?' అని అనుకుంటూ అటూ ఇటూ చూసింది ఎలుక. అప్పుడు పెన్సిలు "నేనేనక్కా.... పెన్సిలుని. నన్ను కొరకొద్దు వదిలేయ్ ప్లీజ్" అని అంది. ఎలుకేమో "నాకు ఆకలిగా ఉంది. నిన్ను తినేస్తాను" అంది. పెన్సిలు అందిగదా... "నాతో నీ ఆకలి తీరదు. ఎందుకంటే నేనొక చెక్కముక్కను మాత్రమే... నన్ను కొరికితే పొట్టు తప్పనీకేమీ రాదు. అందుకని నన్నొదిలేయ్ ప్లీజ్". కానీ ఎలుక వినలేదు.'నా పళ్ళు గులగులలాడుతున్నాయి. నిన్ను కొరికితే అవి పదునెక్కుతాయ' అంటూ మీదికొచ్చింది. అప్పుడు పెన్సిలు 'అయితే నా ఆఖరికోరిక ఒకటుంది... అది తీర్చుకోనివ్వు ప్లీజ్' అని బతిమలాడింది. "ఏమిటా కోరిక?" అని అడిగింది ఎలుక, "ఇదిగో, ఈ కాగితం మీద ఒక బొమ్మవేస్తాను. ఇదేనా ఆఖరి కోరిక" అని చెప్పింది పెన్సిలు. 'సరే.. తొందరగా కానియ్' అని అటుతిరిగింది ఎలుక. పెన్సిలు చకచకా కాగితం మీద ఒక పెద్ద సున్నా చుట్టి అందులో 3 చిన్న సున్నాలు పెట్టి ఒక మీసం గీసింది (పిల్లి బొమ్మ టీచర్ బోర్డు మీదవేసి చూపాలి) అయిపోయిందా అంటూ ఎలుక ఇటు తిరిగేసరికి ఇంకేముంది.... కాగితం మీద పెద్ద పిల్లి. ఎలుక పరుగో పరుగు!!

- పెన్సిలు భలే తెలివయింది గదూ!!

## 5. పాయసం తాగిన కుందేలు

ఒక కుందేలుకి పాయసం తాగాలనే కోరిక పుట్టింది. కానీ ఇంట్లో పాయసం చేయడానికి వస్తువులు లేవు. పక్కింట్లో ఉన్న ఉడుత దగ్గర కెళ్ళింది.'వదినా నేను పాయసం చేసుకుంటున్నాను. కొద్దిగా చక్కెర తక్కువ పడింది. ఒక కప్పు చక్కెర అప్పు ఇవ్వవా?" అని అడిగింది. ఉడుత చక్కెర ఇచ్చింది. తర్వాత గుడ్లగూబ దగ్గరకు వెళ్ళింది కుందేలు. "పిన్నీ! నేను పాయసం చేసుకుంటున్నాను. కొంచెం సేమ్యా తక్కువ పడింది. ఒక అరకప్పు సేమ్యా అప్పుగా ఇస్తావా?" అని అడిగింది. గుడ్లగూబ సేమ్యా ఇచ్చింది. తర్వాత ఆవు దగ్గరకు వెళ్ళింది కుందేలు. "పెద్దమ్మా! నేనుపాయసం చేసుకుంటున్నాను. కొంచెం పాలు తక్కువ

పడ్డాయి. ఒక కప్పుపాలు అప్పుగా ఇస్తావా?'' అని అడిగింది. ఆవు పాలతోపాటు నెయ్యికూడా ఇచ్చింది. చక్కెర, సేమ్యా, పాలు, నెయ్యి అన్నీ వేసి కుందేలు పాయసంచేసుకుంది. హాయిగా తినేసింది.

## 6. పాపం ఈగ!

అనగనగా ఒక ఊరు. ఆ ఊళ్ళో ఒక పూరిల్లు. ఆ పూరింట్లో ఒక సాలెపురుగు. ఒక రోజు ఒక ఈగ ఆ ఇంట్లోకి వచ్చింది. ''రామ్మా ఈగా! రా! నీపేరేమిటి?'' అని అడిగింది సాలీడు. ''నా పేరు రాణి'' అని చెప్పింది ఈగ. ''ఆహా! భలేపేరు! నీ అందానికి తగిన పేరు. రా, లోపలికి రా, అక్కడే నిలబడ్డావేం'' అంది సాలీడు. ''అమ్మో నేను రాను, వస్తే నువ్వు నన్ను తినేస్తావు'' అంది ఈగ. ''అయ్యో! ఎంత మాటన్నావ్ రాణీ .... నీ అంత అందమైన దాన్ని నేనెలా తింటాను .. రామ్మారా.... ఇదిగో చాక్లెట్ తిందువు రా'' అని పిలిచింది. చాక్లెటు అనగానే ఈగకు నోరూరింది. సాలెపురుగు మాటలు నమ్మి సాలె గూట్లోకి అడుగుపెట్టింది.

- తరువాత ఏం జరిగి ఉంటుందో మీరే చెప్పండి!

## 7. పొట్ట పగిలిన చిక్కుడుకాయ

అనగనగా ఒక ఊరు. ఆ ఊళ్ళో ఒక ముసలామె. ఒకరోజు పొద్దున్నే ఆమె కుంపటి రాజెయ్యడానికి బొగ్గులువేసి, కొబ్బరి పీచువేసి అంటించి గాలి తగిలేలాపెట్టి ఏటికి బయలుదేరింది. బొగ్గులు మెల్లగా అంటుకోసాగాయి. అంతలో ఒక బొగ్గు ''అబ్బా.... మంట పుట్టి చురుక్కుమంటుంది'' అంటూ కుంపట్లోంచి కిందకు దూకేసింది. అదిచూసి కొబ్బరి పీచు ''భలే మంచి పనిచేశావు - పద దూరంగా పారిపోదాం'' అంది. బుట్టలో ఉన్న చిక్కుడుకాయ కిందకు దూకి ''నేనూ వస్తాను మీతో లేకపోతే ఈ అవ్వ నన్ను ముక్కలు కోసి కూరొండుతుంది'' అంది.

మూడూ కలిసి బయటికొచ్చి పరుగెత్తుకుంటూ పరుగెత్తుకుంటూ ఏటి ఒడ్డుకొచ్చాయి. ''మరిప్పుడేం చేద్దాం'' అంది కొబ్బరిపీచు. ''ఏరుదాటి ఆదరికెళదాం'' అంది చిక్కుడుకాయ. చిక్కుడుకాయ, బొగ్గు కొబ్బరిపీచు మీద కెక్కి కూర్చున్నారు. పీచు నీళ్ళ మీద మెల్లగా తేలుకుంటూ పోసాగింది. చిక్కుడుకాయ డాన్సు చేయడం మొదలుపెట్టింది. ''వద్దు, మునిగి పోతాం'' అని పీచు చెబుతున్నా అది వినట్లేదు. ఎలాగో ఒడ్డు దగ్గరి దాకా వచ్చారు. అంతలో పీచు తిరగబడిపోయింది. బొగ్గు నీళ్ళలో మునిగిపోయింది. పీచు ఎటో కొట్టుకు పోయింది.

చిక్కుడు కాయ ఎగిరి ఒడ్డుకు దూకింది గానీ, దాని పొట్ట పగిలిపోయింది. పొట్టలోంచి గింజలన్నీ బయటికొచ్చి చెల్లా చెదురుగా పడిపోయాయి.

చిక్కుడుకాయ ఏడుస్తూ గింజలన్నీ ఏరుకుని, పొట్టలో కూరుకుని దర్జీ దగ్గరకు పోయి పొట్టను కుట్టమని బతిమలాడింది. అప్పుడు దర్జీ సన్నటి దారంతో చిక్కుడుకాయ పొట్టకుట్టేశాడు. దర్జీ కుట్టిన ఆ దారమే మనం ఇప్పుడు తీసే పీచు!

## 8. నాన్నా పులి

అనగనగా ఒక రైతు. అతనికి ఒక అల్లరికొడుకు. ఇద్దరూ ఒక రోజు అడవికి వెళ్ళారు. నాన్న దూరంగా కట్టెలు కొడుతూ ఉండగా కొడుకు ఒక చెట్టు కింద ఆడుకుంటున్నాడు. నాన్నను ఆటపట్టించాలనిపించి ఆ అల్లరి పిల్లవాడు ఉన్నట్టుండి “నాన్నా పులి నాన్నా పులి” అని గట్టిగా అరిచాడు. ఆ రైతు పరుగెత్తుకుంటూ వచ్చాడు. అక్కడ పులీ గిలీ ఏమీ లేకపోయేసరికి ఎందుకిలా చేశావని కొడుకును కోపంగా అడిగాడు.“హహహ... ఊరికే గమ్మత్తు చేశా” అన్నాడు పిల్లవాడు. అలా చేయకూడదని చెప్పి తండ్రి తన పన్లోకి వెళ్ళిపోయాడు. మళ్ళీ కాసేపటికి అలాగే “నాన్నా పులీ... ” అంటూ అరిచాడు. ఆదుర్దాగా, భయంగా వచ్చిన నాన్న నవ్వుతున్న కొడుకును చూసి, బాగా కోప్పడి ఇంకోసారి అలా చేయవద్దని హెచ్చరించి తన పనిలోకి వెళ్ళిపోయాడు.

కాసేపటికి నిజంగానే పులి వచ్చింది. పిల్లవాడికి భయంతో వణుకు పుట్టింది. “నాన్నా పులి... నిజం నాన్నా... నాన్నా పులి... నిజంగానే పులొచ్చింది” అని కేకలు పెట్టాడు. అతని మాటల్ని తండ్రి నమ్మలేదు. ఎప్పటిలాగే తమాషా చేస్తున్నాడని అనుకున్నాడు.

పిల్లవాడికి ఒళ్ళంతా చెమటలు కారిపోతున్నాయి. ఏం చేయాలో పాలుబోవడం లేదు. నోటి వెంట మాట కూడా రావడం లేదు. అంతలో ఆదారిన వెళ్తున్న ఏదో గూడెం మనుషులు ఇది చూశారు. ఆ పులిని తరిమి వేశారు. ఈ హడావుడికి వడివడిగా వస్తున్న నాన్నను ఏడుస్తూ ఎదురెళ్ళి వాటేసుకున్నాడు పిల్లవాడు. ఇంకెప్పుడూ అబద్దం ఆడ కూడదనీ, ఎవరినీ ఆటపట్టించకూడదనీ అనుకున్నాడు.

## 9. పుచ్చకాయల పరుగుపందెం

అనగనగా రెండు పుచ్చకాయలున్నాయి. అవి ఒకరోజు పరుగుపందెం పెట్టుకున్నాయి. కాలిబాటవెంబడే బయలు దేరి చెరువు కట్ట మీదకు ముందుగా ఎవరెక్కితే వాళ్ళే గెలిచినట్లనుకున్నాయి. ఇక పరుగే పరుగు. గునగునా ధనధనా టకటకా చకచకా దొర్లుకుంటూ దొర్లుకుంటూ పరుగెత్తుతున్నాయి. ఆదారినే భుజానికి సంచి తగిలించుకుని బడికి పోతున్న పవన్ ఈ పుచ్చకాయల్ని చూశాడు. 'అయ్... భలే పరుగుపెడుతున్నాయ్ పుచ్చకాయలు' అనుకుని తను కూడా వాటి వెంట పరుగెత్తడం మొదలుపెట్టాడు. కొంతదూరం పోయేసరికి పుచ్చకాయలకి అలుపొచ్చింది. ఆగుదామంటే ఆగుదామనుకుని రెండూ ఆగిపోయాయి. 'మా పరుగుపందెంలోఎవరు గెలిచాము?' అని పవన్‌ని అడిగాయి. 'ఎవరు గెలిచారు' ఇద్దరూ సమానంగా పక్కపక్కనే పురుగెత్తారు. పక్కపక్కనే ఆగారు. ఇంకెవరు గెల్చారు? అన్నాడు పవన్. 'అయితే ఇద్దరు ఓడిపోయామా?' అని నిరాశగా అడిగాయి పుచ్చకాయలు. 'కాదు ఇద్దరూ గెల్చారు' అన్నాడు పవన్. 'హాహాహా... ఇద్దరం గెల్చాం ఇద్దరం గెల్చాం' అని చిందులేస్తున్నాయి పుచ్చకాయలు. అంతలో అక్కడికి ఒక టమాటో కాయ ముఖం ఎర్రగా పెట్టుకొని కోపం కోసంగా వచ్చింది. 'ఎగరండెగరండి రాజుగారి దగ్గరికి పోతున్నాలే మీ మీద ఫిర్యాదు చెయ్యడానికి' అంది. కాయలు రెండూ భయపడి 'ఎందుకు? మేమేం చేశాం' అన్నాయి. 'ఒక్కసారి మీ ఒళ్ళుచూసుకోండి' అంది టమాటో. చూసుకుంటే అక్కడక్కడా ఎర్రటి మరకలు కనబడ్డాయి. ఏంటి మరకలు? అన్నాడు పవన్. అవి రక్తపు మరకలు నా చిన్న కూతురిది పొలం నుంచి ఆయనొచ్చే వేళయిందని పొయ్యిమీద చారుపెట్టి అందులోకి చింతపండు తెమ్మని మా చిన్నదాన్ని సుబ్బయ్య కొట్టుకి పంపిస్తే.. పాపం అది దారిన ఒక పక్కన మెల్లగా పోతుంటే.. కన్నూమిన్నూగానకుండా దాన్ని తొక్కేసి యాక్సిడెంటు చేసేసొచ్చి ఇక్కడ గెంతులేస్తున్నారా... దాని ఒళ్ళంతా గాయాలే' అని కళ్ళొత్తుకుంది టమాటకాయ. 'రాజుగారికి చెప్పి మీకు శిక్షవేయించక పోతే చూడండి' అని ముందుకు కదిలింది. పుచ్చకాయలకి భయమేసింది. 'చెల్లీ చెల్లీ.... మమ్మల్ని క్షమించవా.. ప్లీజ్... ఇంకెప్పుడూ దారెంబటి ఇలా అజాగ్రత్తగా రాము. టమాటాని మా ఇంటికి తీసుకెళ్ళి దగ్గరుండి వైద్యం చేయిస్తాము. జాగ్రత్తగా చూసుకుంటాము. ప్లీజ్' అన్నాయి. పవన్ కూడా నచ్చజెప్పేసరికి టమాటా మెత్తపడింది. 'సరే... అలానే

కానీయండి' అంది. పుచ్చకాయలు సంతోషించాయి. తియ్యటి పుచ్చబద్దలు తినిపిస్తూ బుల్లిటమాటా కోలుకునేదాకా జాగ్రత్తగా చూసుకున్నాయి.

## 10. అపాయంలో ఉపాయం

అనగనగా ఒక ఊరు ఆ ఊరిలో లత, రాము అని ఇద్దరు మంచి స్నేహితులు. బడికి సెలవులిచ్చారు. ఇద్దరూ స్నేహితులూ పక్క ఊరిలో ఉన్న తమ స్నేహితుడిని కలిసేందుకు బయలుదేరారు. అడివిగుండా ఉన్న దగ్గరిదారి గుండా వారు వెళ్తూ ఉండగా నల్లని ఒక పెద్ద ఎలుగుబంటి వాళ్ళవైపుగా రావడం కనిపించింది. ఇద్దరికీ చాలా భయం వేసింది. రాము అన్నాడు గదా... 'లతా! మనం చెట్టెక్కి కూర్చుందాం, ఆ ఎలుగు ఈ ప్రాంతం నుంచి వెళ్ళిపోయిన తర్వాత దిగి వద్దాం" అని కానీ లతకు చెట్టు ఎక్కడం రాదు.

ఎలుగుబంటి అంతకంతకూ దగ్గరవుతున్నది. ఇంతలో లతకు మెరుపు లాంటి ఆలోచన తట్టింది. 'రామూ! నువ్వు చెట్టు ఎక్కేసెయ్' అంది 'మరి నువ్వేలా లతా..' అని అడుగుతూనే రాము చెట్టెక్కేశాడు. లత ఆ చెట్టుకిందనే కదలకుండా పడుకుంది. ఎలుగుబంటి దగ్గరగా వచ్చింది. లత ఊపిరి బిగబట్టి కదలక మెదలక అలాగే ఉండిపోయింది. లత ప్రాణంతో లేదని భ్రమపడి ఎలుగుబంటి వెళ్ళిపోయింది.

రాము సంతోషంగా చెట్టుదిగి వచ్చాడు. "భలే ఉపాయం లతా" అంటూ మెచ్చుకున్నాడు. ధైర్యం పోగొట్టుకోకుండా ఆలోచిస్తే అపాయాలనైనా ఉపాయాలతో దాటవచ్చని అనుకుంటూ స్నేహితులిద్దరూ హాయిగా ముందుకుసాగారు.

## 11. ఉప్పు సముద్రం

అనగనగా ఒక ఊళ్ళో రామయ్య, సోమయ్య అని ఇద్దరు ఇరుగుపొరుగువాళ్ళుండేవాళ్ళు. ఒక రోజు రామయ్య కట్టెలు కొట్టుకోడానికి అడవికి వెళ్ళాడు. దారిన వెళ్తూ ఉండగా 'కాపాడండి కాపాడండి' అని సన్నకేక వినబడింది. ఎవరా అని అటూ ఇటూ చూస్తే ఒక చిన్న మూరెడంత పుల్లకింద వేలెడంత మనిషి చిక్కుకుని కనపడ్డాడు. రామయ్య గబుక్కున ఆ పుల్ల తీసి పక్కకు విసిరేశాడు. ఆ వేలెడంత మనిషి అక్కడుండే మరుగుజ్జుల రాజ్యానికి రాజంట. తన ప్రాణాలు కాపాడినందుకు రామయ్యకి ఒక మాయ

తిరగలిని బహుమతిగా ఇచ్చాడంట. ఆ తిరగలిని తిప్పి ఏది కావాలని కోరుకుంటే అది వచ్చేస్తూనే ఉంటుందట. ఆ రాజుని మనసులో తల్చుకుంటే రావడం ఆగిపోతుందట. రామయ్యకి ఆకలిగా ఉండి తిరగలి తిప్పి 'లడ్లు కావాలి' అన్నాడు. వస్తూనే ఉన్నాయి లడ్డెంబటి లడ్డు లడ్డెంబటి లడ్డు.... మనసులో రాజుని తల్చుకుని 'ఇకచాలు' అనేంత వరకు! రామయ్య తిరగలి ఇంటికి తెచ్చుకుని తనకు కావల్సినవన్నీ పుట్టించుకుంటూ (మీరైతే ఏమేం పుట్టిస్తారో చెప్పండి) హాయిగా ఉన్నాడు. రామయ్య వైభోగం చూసి సోమయ్యకి కుళ్ళు పుట్టింది. రామయ్య, ఆయన భార్య మాట్లాడుకుంటున్న మాటల్ని దొంగచాటుగా విని, ఒకరోజు తిరగలిని దొంగతనం చేశాడు. ఒక పడవలో పక్కరాజ్యంకి పారిపోదామని సముద్రం మీద బయలుదేరాడు. కొద్దిదూరం పోయినాక ఆకలై అన్నం తిందామని క్యారేజీ తీశాడు. మజ్జిగన్నంలో ఉప్పువేసుకోవడం మర్చిపోయేసరికి.... తిరగలి తిప్పి 'ఉప్పుకావాలి' అన్నాడు. ఉప్పువస్తానే ఉంది. 'రాజుని తల్చుకుంటే తప్ప కోరింది రావడం ఆగదు' అని వాడికి తెలవదు కదా... అందుకని ఆ తిరగలి అట్లా తిరుగుతునే ఉంది. ఉప్పేమో వస్తానే ఉంది. పడవంతా ఉప్పు పడవమునిగి పోయింది. సోమయ్యా మునిగిపోయాడు. ఇంకా సముద్రంలో తిరగలి తిరుగుతూనే ఉంది. ఉప్పు వస్తానే ఉంది. కావాలంటే ఎప్పుడైనా సముద్రం దగ్గరికెళ్ళినపుడు కాసిని నీళ్ళు నోట్లో పోసుకుని చూడండి. ఒకటే ఉప్పు!!

## 12. ఆవు - కోడి - గొర్రె

అనగనగా ఒక అడవిలో ఆవు, కోడి, గొర్రె - ఈ మూడూ చాలా స్నేహంగా ఉండేవట. ఒకరోజు ఆవు ఒక కొత్త రూక (రూపాయిని)ను కోడి కిచ్చి " పట్నం వెళ్ళి బిళ్ళ తీసుకురా... మా అమ్మకి జ్వరమొచ్చింది" అని చెప్పిందట. కోడేమో ఆ కొత్తరూకను తీసుకొచ్చి గొర్రెకి ఇచ్చిందట. తనకి పనుందని చెప్పి గొర్రెను పట్నం పంపిందట. గొర్రె దారినెక్కడో ఆ కొత్త రూకను పారేసిందట.

జ్వరమొచ్చినా బిళ్ళ తెప్పించలేదని అలిగి ఆవు వాళ్ల అమ్మ ఇల్లొదిలి ఎటో వెళ్ళిపోయిందట. అప్పట్నుంచి ఆవులన్నీ పాపం అమ్మా అమ్మా.. అని అరుస్తానే ఉన్నాయట. అదేమనకు అంబాఅంబా అని వినపడతుందట. కొళ్ళేమో 'కొత్తరూక' పోయిందిగదా అని బాధపడుతూ 'కొత్తరూకే కొత్తరూకే' అని కూస్తానే ఉన్నాయంట. అదేమనకు 'కొక్కొరోకో

కొక్కొరోకో' అని వినపడుతుందట. గొర్రెలేమో 'ఎక్కడన్నా దొరుకుద్దేమో పోయిన రూక' అని వెదుకు తానే ఉన్నాయంట. కావాలంటే చూడండి గొర్రెలన్నీ దారిన పోయ్యేటప్పుడు తలకాయలు వంచి నేలపై అటూ ఇటూ చూసుకుంటూ వెళ్తుంటాయి!

## 13. ఎలుక - టోపీ

అనగనగా ఒక ఎలుక. ఒక రోజది తన కలుగు ఊడ్చుకుంటుంటే ఒక అందమైన బట్టదొరికింది. బట్ట భలే ఉందిగదా, అని దాన్ని తీసుకుని అద్దకం వేసే ఆయన దగ్గరకు వెళ్ళింది. ఈ బట్ట మీద అందమైన రంగువేయమని అడిగింది. "అబ్బోనాకు చాలా పని ఉంది. రాణిగారి బట్టలే చాలా ఉన్నాయి" అన్నాడు అద్దకమాయన. "మర్యాదగా నేను చెప్పింది చేస్తావా.. మా వాళ్ళందర్నీ తీసుకొచ్చి ఈ రాత్రికి నీ ఇంట్లో బట్టలన్నీ తుక్కుతుక్కు చేసేయమంటావా" అని భయపెట్టింది ఎలుక. ఇది అన్నంత పనీ చేస్తుందేమోనని భయపడి బట్టకు రంగులేసిచ్చాడు అద్దకమాయన. అప్పుడా రంగురంగుల బట్టను తీసుకుని దర్జీ దగ్గరకు పోయి టోపీ కుట్టమంది. మనుషులకి బట్టలు కుట్టడానికే సమయం చాలక నేనేడుస్తుంటే, ఎలుకకు టోపీ కావాలా? నేను కుట్టనుపో" అన్నాడు దర్జీ ఆయన. అద్దకమతన్ని భయపెట్టినట్లే దర్జీని కూడా భయపెట్టింది ఎలుక. దర్జీ టోపి కుట్టి ఇచ్చాడు. ఎలుక చక్కగా స్నానం చేసి ముస్తాబై కొత్త టోపి పెట్టుకుని దారెంబడి పోతుంటే అందరూ వింతగా చూస్తున్నారు. ఆ దారిన వస్తున్న రాజుకి ఎదురయ్యింది ఎలుక. రాజు ఎలుకను చూసి ఆశ్చర్యపోయి.... 'ఎలుకా ఎలుకా భలే ఉన్నావే! నీకుఏం కావాలో కోరుకో' అన్నాడు. "నన్నొక్కసారి మీ ఏనుగంబారీ మీదకు ఎక్కించుకోండి రాజా" అంది ఎలుక. రాజు అలాగే చేశాడు.

రాజుగారి ఏనుగు మీద సవారీ చేసింది గదా అప్పట్నుంచి అందరూ ఆ ఎలుకను గౌరవంగా చూడసాగారు. ఎలుకలన్నీ కలిసి తమ రాజ్యానికి 'మహారాణి'గా తనను ఎన్నుకున్నాయి.

## 14. ములక్కాయంత ముసలమ్మ కథ

అనగనగా ఉల్లిపాయంత ఊరు ఉండేది. ఆ ఊళ్ళో ములక్కాయంత ముసలమ్మ ఉండేది. ఆమెకు ఒకరోజు వంకాయంత వజ్రం దొరికింది. దాన్ని తెచ్చి బీరకాయంత బీరువాలో దాచింది. దీన్ని దొండకాయంత దొంగ చూశాడు. ములక్కాయంత ముసలమ్మ పొలం వెళ్ళిపోయాక దొండకాయంత దొంగ బీరకాయంత బీరువాని పగలకొట్టి వంకాయంత వజ్రాన్ని దొంగిలించాడు. అప్పుడీ సంగతిని ములక్కాయంత ముసలమ్మ పొట్లకాయంత పోలీసుకి చెప్పింది. పొట్లకాయంత పోలీసేమో దొండకాయంత దొంగను పట్టుకుని లవంగమంత లాఠీతో రెండు దెబ్బలేసి జామకాయంత జైల్లో పెట్టాడు. జామకాయంత జైల్లో పెట్టి దానికి తాటికాయంత తాళం వేశాడు!

## 15. చెరపకుర చెడేవు (గేయకథ)

ఇంటిలోన కుక్క బావ
గంప కింద కోడి మామ
ఒక్కదాన్ని విడిచి ఒకటి
ఉండమంటే ఉండవెపుడు.

    దేశమంతా చూడదలచి
    కుక్క, కోడి రెండు కలిసి
    ఆడుకుంటూ పాడుకుంటూ
    పయనమయ్యే ఊరు విడిచి

భద్రాచలం కొండదాటి
గోదారమ్మ నదిని దాటి
నరులు లేని వనముదాటి
ఆగిరచట అలసిసొలసి

    చెట్టు కొమ్మ మీద కోడి
    చెట్టు వెనుక కుక్క చేరి
    గుట్టుగాను నాటిరాత్రి
    నిద్రపోయే ఆదమరచి

తెల్లవారు ఝామునకాగ
మెల్లగాను కోడికూసె
కూతవిన్న పిల్లిఒకటి
మెల్లమెల్లన కోడిని చేరెను

కోడిబావ కోడిబావ
కొమ్మమీద నుంటివేల
దగ్గరనే మాది ఇల్లు
రారమ్మని పిలిచెను

పిల్లిపిలుపు విన్నకోడి
కల్లకపటమంత ఎరిగి
గట్టిగాను బుద్ధిచెప్ప
దలచి ఇట్లనియెనూ..!

చెట్టు వెనుక గుట్టుగాను
చుట్టముొకడూ పడుకొనే
వాని లేపవోయి బావ
కలిసి వెళ్దామందరం

ఆహారం దొరికిందని
సంతసించి పిల్లి అపుడు
మ్యావ్‌మ్యావ్ మ్యావంటూ
కేకవేసె పెద్దగా

కేకవిన్న కుక్కబావ
నిద్రలేచివచ్చెను
దొంగచూపు చూస్తుఉన్న
పిల్లిపని పట్టెనూ....

బుద్ధిలేక పరులనెపుడు
చెరపకురా చెడేవు
క్రిందమీదుగానలేక
ఉరకకురా పడేవు!

# పాఠశాల సంసిద్ధత కార్యక్రమం
# సృజనాత్మక కృత్యాల నిర్వహణ - సూచనలు

- సృజనాత్మక కృత్యాలను ప్రతి రోజు మధ్యాహ్నం మొదటి సెషన్‌లో రోజువారీగా ఒక్కో కృత్యాన్ని నిర్వహించాలి.
- 15 రోజులకు సూచించబడిన 15 కృత్యాలకు అదనంగా 5 కృత్యాలు ఇవ్వబడ్డాయి.
- ఉపాధ్యాయులు తమ సౌలభ్యాన్ని బట్టి పై కృత్యాలతోపాటు అదనంగా మరికొన్ని కృత్యాలను నిర్వహించుకోవచ్చు.

## అవసరమైన సామగ్రి

- బంకమట్టి
- రబ్బరు బూరలు
- చిత్తు కాగితాలు / న్యూస్ పేపర్
- పండ్లు, పూల (నలుపు - తెలుపు) చిత్రాలు, అన్ని రంగుల క్రేయాన్స్
- వివిధ ఆకారాల అట్టముక్కలు
- లోపాలు గల జంతువులు - పక్షుల చిత్రాలు
- సబ్బు, స్ట్రాలు
- గింజలు, ధాన్యం, రాళ్ళు, పూసలు, దారాలు
- ఖాళీ అగ్గిపెట్టెలు, రబ్బరు మూతలు

## సృజనాత్మక కృత్యాలు

***వివిధ ఆకారాలను గీయడం***





మొదలైన ఆకారాలను ఉపాధ్యాయుడు నల్లబల్లపై గీయాలి.

- ఒక్కో ఆకారాన్ని పిల్లలచేత గీయించాలి.

1. మట్టితో బొమ్మలు - నమూనాలు తయారు చేయడం

- బంకమట్టిని తయారుచేసి / సేకరించి పిల్లల చేత వారికి ఇష్టమైన బొమ్మలు, నమూనాలు చేయమనాలి. ఉదాః చక్రం, సెల్‌ఫోన్, నీటితొట్టి, పాము మొదలైనవి.

2. రబ్బరు బూరల్లో (బెలూన్లు) గాలి ఊదడం

- ఖాళీ రబ్బరు బూరలను పిల్లలకు ఇచ్చి గాలి ఊదమనాలి.
- గాలి ఊదిన బూరలను దారంతో కట్టి ఎగరవేయమనాలి.

3. కాగితాలను వివిధ ఆకారాలలో చించడం

- పిల్లలకు ఒకే సైజు కలిగిన కాగితాలను ఇవ్వాలి.
- ఉపాధ్యాయుడు ఒక్కో ఆకారాన్ని చూపి తనతోపాటు పిల్లల్ని చించమనాలి.
- ఈ విధంగా వివిధ ఆకారాలలో కాగితాలను పిల్లలచేత చించమనాలి.

4. బొమ్మల కొలువు

- పిల్లలను వారి ఇంటి నుండి ఆడుకునే రకరకాల బొమ్మలను పాఠశాలకు తీసుకురమ్మని చెప్పాలి
- వీలైతే స్నేహితులనుండి సేకరించి తీసుకురమ్మనాలి.
- తరగతిలో క్రమపద్ధతిలో ప్రదర్శించడం ద్వారా బొమ్మల కొలువు నిర్వహించాలి.
- అనంతరం ఉపాధ్యాయులు బొమ్మలను ఆయా పిల్లలకు తిరిగి ఇవ్వాలి.

5. పండ్లు - పూలకు రంగులు అద్దడం

- వివిధ పండ్లు - పూల చిత్రాలను పిల్లలకు ఇవ్వాలి
- వాటి పేర్లు, రంగు చెప్పించాలి
- క్రేయాన్లతో వాటికి రంగులను దిద్దించాలి.

**6. అట్టముక్కలతో ఇళ్ళు నిర్మాణం**

- వివిధ ఆకారాలు గల అట్టముక్కలను ఉపాధ్యాయులు సేకరించుకోవాలి
- వాటిని పేర్చడం ద్వారా వివిధ రకాల ఇళ్ళు నమూనాలు నిర్మించమనాలి.

**7. ఫ్యాన్సీ డ్రస్**

- పిల్లల తల్లిదండ్రులకు ముందుగానే ఫ్యాన్సీడ్రస్ వేషధారణ గురించి ఉపాధ్యాయులు సమాచారం అందించి వారి సహకారాన్ని కోరాలి.
- తల్లిదండ్రులు తమ పిల్లలతో వారికి అందుబాటులో ఉన్న డ్రస్, అలంకరణతో హాజరయ్యేలా ప్రోత్సహించాలి.
- పాఠశాలలో విద్యార్థి వారీగా ప్రదర్శింపజేయాలి. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు ఇవ్వాలి.

**8. మాలో లోపించిన వాటిని గుర్తించండి - గీయండి**

- పెంపుడు జంతువులు, అడవి జంతువులు, పక్షుల చిత్రాలను ఏదో ఒక లోపంతో గీసి పిల్లలకు ఇవ్వాలి.
- పిల్లలచేత ఆ చిత్రంలో లోపించిన వాటిని గుర్తించి చెప్పమనాలి.
- చిత్రంలో లోపించిన వాటిని పిల్లలచేత గీయించాలి.

**9. సబ్బునీటితో బుడగలు**

- ఉపాధ్యాయుడు నీటిలో కొద్దిగా సబ్బువేసి, సబ్బునీటిని బాగా కలిపి స్ట్రాలు, సన్నని పుల్లలను గుండ్రంగా చేసి వాటితో బుడగలు ఊదమనాలి.

**10. వేరు చేయడం**

- పిల్లలను జట్లుగా చేయాలి
- రకరకాల గింజలు, ధాన్యాలు, రాళ్ళు, పూసలు కలిపి ఒక పేపరుపై పోసి వాటిని వేరు చేయమనాలి.
- ఏ జట్టు ముందుగా చేస్తే వారు గెలిచినట్లు ప్రకటించాలి.

**11. వివిధ వాహనాల అనుకరణ**

- పిల్లల చేత వివిధ రకాల వాహనాల పేర్లను చెప్పించాలి.
- ఆ వాహనాలను నడుపుతున్నట్లుగా పిల్లలను అనుకరించమనాలి.

**12. వివిధ రకాల దుకాణాల నిర్వహణ - అనుకరణ**

- పిల్లలచేత వివిధ రకాల దుకాణాల గురించి చెప్పించడం
- కిరాణం, కూరగాయలు, హోటల్ మొదలైన వాటిని నిర్వహిస్తున్నట్లుగా అనుకరింపచేయాలి.

**13. పాటలకు డాన్స్ చేయడం**

- పిల్లలను స్వయంగా పాటపాడుతూ డాన్స్ చేయమనాలి.
- పాటలు వినిపిస్తూ వాటికి అనుగుణంగా డాన్స్ చేయమనాలి.

**14. రంగులు - రంగులు**

- ఉపాధ్యాయుడు ఏడురంగులు ఛార్టుపై ప్రదర్శించాలి
- ఒక్కో పిల్లవాడికి తెల్లకాగితం ఏడు రంగుల క్రేయాన్స్ ఇచ్చి ఏడురంగులను దిద్దించాలి
- ఏడు రంగుల పేర్లను పిల్లలచేత చెప్పించాలి

**15. పక్షులు - జంతువులను అనుకరించడం**

- పిల్లలచేత పక్షులు - జంతువుల పేర్లను చెప్పించాలి
- వాటి మాదిరిగా అరుస్తూ అభినయించాలి - అభినయింపజేయాలి.

**16. దండ గుచ్చండి**

- ఉపాధ్యాయుడు పూసలు, దారాలను సమకూర్చుకోవాలి
- ఒక్కోపిల్లవాడికి కొన్ని పూసలు, దారం ఇచ్చి దండ గుచ్చమనాలి
- ఎవరు ముందుగా దండ గుచ్చితే వారు గెలిచినట్లు

### 17. అగ్గిపెట్టెలతో రైలుబండి

- ఉపాధ్యాయుడు ఖాళీ అగ్గిపెట్టెలను, రబ్బరు మూతలను సేకరించుకోవాలి
- ఒక్కో అగ్గిపెట్టెను జతపరుస్తూ రబ్బరు మూతలను చక్రాలుగా ఉపయోగిస్తూ రైలుబండిని తయారు చేయించాలి.
- ఇంకా ఖాళీ అగ్గిపెట్టెలతో వివిధ రకాల వాహనాలను కూడా తయారు చేయించాలి.

### 18. గింజలు, రాళ్ళు, పుల్లలతో ఆకారాలు

- రకరకాల గింజలు, రాళ్ళు, పుల్లలను ఉపాధ్యాయుడు సేకరించుకోవాలి
- నల్లబల్లపై వివిధ ఆకారాలను గీయాలి.
- ఆయా ఆకారాలలో గింజలు, రాళ్ళు, పుల్లలను పేర్చమనాలి

### 19. గాలి పటాలు, రాకెట్, పడవల తయారీ

- ఒకే సైజుగల కాగితాలను, పుల్లలను ఉపాధ్యాయుడు సేకరించుకోవాలి
- గాలిపటం, రాకెట్, పడవ తయారీ విధానాన్ని స్వయంగా చేసి చూపుతూ పిల్లలచేత చేయించాలి.

# ఆటలు ఆడుచున్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు / సూచనలు

- పిల్లల సంఖ్యకు తగినంత ఆట స్థలమును ఎన్నుకొనవలయును.
- ఆటకు కావలసిన సామాగ్రిని ముందే సిద్ధము చేసుకొనవలయును.
- ఆటకు తగినట్లు విద్యార్థులను గ్రూపులుగా చేసి తగు సూచనలు ఇవ్వవలయును.
- ఆ ప్రాంతంలో ప్రాచుర్యం పొందిన ఆటలను కూడ ఆడించవలయును.
- ఈ మాడ్యూల్‌లో అదనపు ఆటలు కూడా చేర్చబడినవి. సందర్భానుసారంగా వాటిని ఆడించవలయును.
- ఆటలో అందరు పాల్గొనేలా ఆసక్తి కోల్పోకుండా చూడవలయును.
- ప్రత్యేక అవసరాలు గల పిల్లలకి తగిన ఆటలను ఆడించవలయును.

## ఆటలకు కావలసిన సామాగ్రి

1 - బంతులు

2 - పలచని కాగితాలు

3 - తాడులు

6 - కోడి ఈకలు

8 - కర్చీఫ్స్

9 - బెలూన్స్ (గాలి బూరలు)

15 - స్పూన్స్, సీసం గోలీలు లేదా పుస్తకములు

***గమనిక:*** ఆటలాడించడానికి ముందు 'వామ్-అప్' కృత్యాలు 15 అదనంగా ఇవ్వబడ్డాయి. వీటిని ఆటకు ముందుగాని లేదా విడిగా గాని ఉపయోగించి విద్యార్థులను ఉత్సాహపరచవలెను.

## పాఠశాల సంసిద్ధతా కార్యక్రమము
## ఆటలు

# Day-wise time table

| | | |
|---|---|---|
| 1st day | - | బంతిని తప్పించుకోవడం |
| 2nd day | - | ఉఫ్ ఆట |
| 3rd day | - | తాడు లాగడం |
| 4th day | - | గీతమీద నడవడం |
| 5th day | - | కప్పగంతులు |
| 6th day | - | ఈక ఆట |
| 7th day | - | ముక్కుగిల్లిపోయే ఆట |
| 8th day | - | కర్చీఫ్ ఆట |
| 9th day | - | ఢాం, ఢాం, బెలూన్ |
| 10th day | - | గురిచూసి విసరడం |
| 11th day | - | ఇడ్లీ, కాఫీ, వడ |
| 12th day | - | కనుక్కోండి చూద్దాం |
| 13th day | - | బొమ్మ - ప్రాణం |
| 14th day | - | పరిమాణాలను గుర్తించుట |
| 15th day | - | తలపై పుస్తకం లేదా స్పూన్‌లో సీసం గోలి ఉంచుకొని గీతపై నడవడం |

## 1. బంతిని తప్పించుకోవడం

- పిల్లలను వలయాకారంలో నిలబెట్టి వాళ్ల చుట్టూ మిగిలిన వాళ్ళను గుండ్రంగా నిలబడమనాలి.
- గుండ్రంగా నిలబడిన వాళ్ళు మధ్యలో నిలబడిన వారికి గురి చూసి మెత్తని బంతిని విసురుతారు.
- మధ్యలో నిలబడిన పిల్లవాడు ఆ బంతిని తెలివిగా తప్పించుకోవాలి. బంతి తగిలితే అవుటైనట్లు.
- పిల్లలు వంతుల ప్రకారం మధ్యలో నిలబడతారు.
- ఆటలో ప్రతి ఒక్కరికి మధ్యలో నిలబడే అవకాశం వచ్చే వరకు ఆటను ఆడించాలి.

## 2. ఉఫ్ ఆట

- పిల్లలను చిత్తు కాగితాలతో కాగితం ఉండలు తయారు చేసుకోమనాలి.
- దూరం దూరంగా కూర్చొని తమ ముందు ఓ వలయం గీసుకోమనాలి.
- వలయం మధ్యలో తమ కాగితపు ఉండలు ఉంచి తలవంచి వాటిని ఊదమనాలి. ఆ ఉండలు నెమ్మదిగా గీతదాటి బయటికి వెళతాయి.
- ఊదిన పిదప ఆ ఉండలను ఒక్కొక్కటే చేతిలో తీసుకోవాలి. అలా తీసినపుడు పక్క ఉండ కదిలినచో ఆ ఉండలు తీసుకోరాదు. ఎవరు ఎక్కువ ఉండలు తీసుకుంటే వారు గెలిచినట్లు.

## 3. తాడు లాగడం

- పిల్లలను రెండుజట్లుగా విభజించాలి.
- ప్రతి జట్టునందు పిల్లల సంఖ్య సమానంగా ఉండాలి.
- రెండుజట్లను ఎదురెదురుగా నిలబెట్టి వారి మధ్య ఒక గీతను గీయాలి.
- ఒక తాడును వారి చేతికి ఇచ్చి ఒక కొనను ఒక జట్టు, రెండవ కొనను మరొక జట్టును పట్టుకోమనాలి.

- టీచరు విజిల్ వేయగానే రెండు జట్లవారు తాడు వారివారి వైపుకు లాగడానికి ప్రయత్నిస్తారు.
- ఈ లాగడంలో ఏ జట్టు వారైతే గీతదాటి ఎదురు జట్టువైపు వెళతారో ఆ జట్టు ఓడినట్లుగా బలంగా లాగిన జట్టును గెలిచినట్లుగా ప్రకటించాలి.

## 4. గీత మీద నడవడం

- ఒక పొడవైన గీతను గీయాలి.
- పిల్లలందరిని ఒకరి వెనుక ఒకరిని నిల్చోబెట్టాలి. ప్రక్కకు పోకుండా గీతమీదనే నడవమనాలి.
- ఎవరైతే గీత ప్రక్కకు దిగుతారో వారు అవుట్, గీత మీద మొదటి నుండి చివరి వరకు నడచిన వారిని గెలిచినట్లుగా ప్రకటించాలి.

## 5. కప్పగంతులు

- 5 మంది పిల్లలు ఒక బ్యాచ్‌లో ఉండేలా బ్యాచ్‌లు చేయాలి.
- ఒక్కో బ్యాచ్ ఒక గీత మీద వరుసగా కూర్చొని కప్పగెంతినట్లు గెంతుతూ ఎదురుగా దూరంగా ఉన్న గీత వద్దకు చేరుకోవాలి. బ్యాచ్‌లో అందరికంటే ముందుగా లక్ష్యం చేరుకున్న వాడిని వేరు చేయాలి.
- ఇలా అన్ని బ్యాచ్‌లు పూర్తి అయిన తర్వాత ప్రతి బ్యాచ్‌లోనూ మొదటి స్థానం పొందిన వారిని ఒక బ్యాచ్‌గా చేసి మళ్ళీ వాళ్ళచేత ఆడించాలి. ఇప్పుడు మొదటి, రెండవ, మూడవ స్థానాలలో నిలిచిన వారు విజేతలు అవుతారు.
- గెంతే దూరం పిల్లల వయస్సును బట్టి 20 అడుగుల వరకు ఉండవచ్చు.
- అవసరం బట్టి గ్రూపుల సంఖ్య, సభ్యుల సంఖ్యను మార్చుకోవచ్చును.

## 6. ఈక ఆట

- పిల్లలు 5 మందికి మించకుండా రెండు జట్లుగా ఏర్పడాలి. ఒక్కో జట్టు వద్ద ఒక చిన్న కోడి ఈక ఉంటుంది.

- టీచర్ విజిల్ ఊదగానే ఈకను రెండు జట్లు గాలిలోకి విసిరివేస్తాయి. అది క్రిందపడకుండా గాలిలోనే ఎగిరేలాగా ఊదుతుండాలి. ఎవరు ఎక్కువ టైమ్ అలా గాలిలో ఈకను ఊదగల్గితే ఆ జట్టు గెలిచినట్లు.
- ఈ ఆటను మరో రకంగా కూడా ఆడవచ్చు. కొంచెం దూరంలో రెండు వృత్తాలు గీసి ఒక్కొ జట్టుకు ఒక్కో వృత్తం, ఒక ఈక కేటాయించాలి. ఈక వారి వృత్తంలో ముందుగా పడేలాగా ఊదగల్గితే ఆ జట్టు గెలిచినట్లు.
- ఈకను చేతితో తాక కూడదు.

## 7. ముక్కు గిల్లి పోయే ఆట

- పిల్లలను రెండు జట్లుగా చేసి జట్టు నాయకులను ఎంపిక చేయాలి.
- జట్టు నాయకులు తమ జట్టులోని ఒక్కొక్కరికి ఒక్కొక్క పేరును పెట్టాలి. ఉదాః బంతి పువ్వు
- ఒక జట్టు నాయకుడు ఎదుటి జట్టు వారిలో ఒకరికి కళ్ళు మూయాలి.
- బంతిపువ్వొచ్చి ముక్కు గిల్లిపో అనగానే బంతి పువ్వు పేరు గల విద్యార్థి వచ్చి ముక్కు గిల్లి యధాస్థానంలో కూర్చోవాలి.
- తర్వాత కళ్ళు మూయబడిన విద్యార్థి కళ్ళు తెరిచి తన ముక్కు గిల్లిపోయిన విద్యార్థిని గుర్తించాలి. సరిగా గుర్తిస్తే గిల్లిన వారు అవుట్ అవుతారు. లేకపోతే మరల ప్రయత్నించాలి. ఇలా అందరి పిల్లలకు అవకాశమివ్వాలి.

## 8. కర్చీఫ్ ఆట

- పిల్లలందరిని వలయాకారంలో కూర్చోబెట్టాలి.
- ఒక్క పిల్లవాడు కర్చీఫ్‌ను చేత్తో పట్టుకొని 'గ్రద్ద వచ్చే' అనుకుంటూ వలయం చుట్టు తిరగాలి. పిల్లలు 'గ్రద్ధవచ్చే కోడిపిల్ల' అనగానే 'కియా, కియా' అనాలి.
- పిల్లవాడు (కర్చీఫ్) వలయం చుట్టూ తిరుగుతూ ఒకరి వెనుక వైపున కర్చీఫ్‌ను వదలాలి.
- ఆ విషయం గుర్తించి ఆ పిల్లవాడు వెంటనే లేచి కర్చీఫ్ పట్టుకొని పాటపాడుకుంటూ తిరుగుతూ వేరే పిల్లవాని వెనుక వదలాలి.

- ఇలా ఎంతసేపైనా ఈ ఆటను ఆడవచ్చును.

## 9. ఢాం, ఢాం , బెలూన్

- ఒక దారమునకు 5 లేక 6 చొప్పున బెలూన్‌లను వ్రేలాడదీయండి.
- విద్యార్థులను జట్టుగా విభజించండి.
- ఒక్కొక్క జట్టును పిలచి చేతులతో బెలూన్‌లను పగలగొట్టమనండి. ఒకేసారి పగలిపోవాలి. ఎవరు తొందరగా బెలూన్ పగల కొడితే వారే విజేత.

## 10.గురిచూసి విసరడం

- పిల్లలకు కొద్ది దూరంలో బక్కెట్టు పెట్టాలి.
- దానికి కొద్ది దూరంలో వలయాకారంగా గీతగీసి అందులో ఒకరి తర్వాత ఒకరు కూర్చొని బక్కెట్టు లోనికి 5 రాల్లు / బంతులు విసరాలి.
- ఎవరి బంతులు / రాల్లు ఎక్కువగా బక్కెట్టులో పడతాయో వారు గెలిచినట్లు.

## 11.ఇడ్లీ, కాఫీ, పూరి

- పిల్లలందరూ గుండ్రంగా నిల్చోవాలి.
- ఉపాధ్యాయుడు మధ్యలో ఉండి సూచనలు ఇస్తూ ఉండాలి.
- ఇడ్లీ అంటే అరచేతిని చూపించాలి. పూరి అంటే చప్పట్లు కొట్టాలి, కాఫీ అంటే కాఫీ త్రాగినట్లు నటన చెయ్యాలి.
- దీనికి అనుగుణంగా చేయని వారిని ఆటనుండి తొలగించాలి.
- చివరకు మిగిలిన వారు విజేత.

## 12.కనుక్కోండి చూద్దాం

- వివిధ రకాల రుచులు గల పదార్థాలు తీసుకొని కళ్ళకు గంతలు కట్టి నాలుకకు రుచి చూపించి (చక్కెర, చింతపండు, ఉప్పు, మిరపకాయ) రుచులు చెప్పించాలి.
- వివిధ రకాల శబ్ధాలను చేసి అది దేని చప్పుడో చెప్పించాలి (గంట, విజిలు, గాజులు, చప్పట్లు)

- వివిధ రకాల వాసన గల పదార్ధాలు సేకరించి కళ్ళు మూసుకొని ముక్కుతో వాసన చూసి పదార్ధాల పేర్లు చెప్పమనాలి.

## 13.బొమ్మ (స్టాచ్యూ)- ప్రాణం

- పిల్లలందరినీ వలయాకారంలో నిల్చోబెట్టాలి.
- టీచర్ 'రన్' అని అనగానే పిల్లలందరు వలయాకారంలో పరుగెత్తాలి.
- "బొమ్మ (స్టాచ్యూ)" అని అనగానే పిల్లలందరు ఎలా ఉంటే నిలబడి పోవాలి. కదలిన పిల్లలను ఆటనుండి తొలగించాలి.
- మళ్ళీ 'రన్' అనగానే పరుగు పెట్టడం మొదలుపెడతారు. చివరకు ఒక్కరే మిగిలేవరకు ఆడిస్తూ ఉండాలి.

## 14.పరిమాణాలను గుర్తించుట

- పిల్లలతో వారికి ఇష్టం వచ్చిన వస్తువులను సేకరింపచేయాలి
- అన్నింటికన్నా పెద్దది, చిన్నది, పొడవైనది, పొట్టిది, లావుగా ఉన్నది, సన్నగా ఉన్నది గుర్తింపచేయాలి.
- తదుపరి పిల్లలందరూ గుర్తించిన వస్తువులలో కిందివిధంగా చేయమనాలి.
- కొన్ని వస్తువులను ఇచ్చి వాటిని క్రమంలో చిన్నదాని నుండి పెద్దదాని వరకు అమర్చమని చెప్పాలి. (పొడవు నుంచి పొట్టి, లావు నుంచి సన్నం)

## 15.తలపై పుస్తకం ఉంచుకొని గీతపై నడవడం / స్పూన్‌లో సీసం గోలి

- పిల్లలను 5గురు చొప్పున ఒక బ్యాచ్ చేయాలి.
- ఒక్కో బ్యాచ్ ఒక గీత మీద వరుసగా తల మీద పుస్తకం పెట్టుకొని నడుచుకుంటూ ఎదురుగా ఉన్న గీత వద్దకు చేరుకోవాలి. బ్యాచ్‌లో అందరి కంటే ముందుగా గీతను చేరుకున్న వారిని వేరుచేయాలి. తలమీద పుస్తకము కింద పడ్తే అవుట్ అయినట్లు. పుస్తకం కింద పడకుండా గీతను చేరుకోవాలి.
- ఇలా అన్ని బ్యాచ్‌లు పూర్తి అయిన తర్వాత ప్రతి బ్యాచ్‌లోనూ మొదటి స్థానం పొందిన వారిని ఒక బ్యాచ్‌గా చేసి మళ్ళీ వాళ్ళచేత ఆడించాలి. ఇపుడు మొదటి, రెండవ, మూడవ స్థానాలలో నిలిచిన వారిని విజేతలుగా ప్రకటిస్తారు.

- నడిచే దూరం పిల్లల వయస్సునుబట్టి మార్చవచ్చును.

  (పుస్తకం నెత్తిన పెట్టుకోవడానికి బదులు స్పూన్‌లో గోళీ పెట్టి స్పూన్ నోట్లో పెట్టుకోవాలి)

## 16.పూలు, పండ్లు, కూరగాయలు

- పిల్లలను వృత్తాకారంలో నిలబెట్టాలి. టీచరు తనతలపై ఒక బుట్ట ఉన్నట్లు దానిలోపల కొన్ని పూలు, పండ్లు, కూరగాయలు ఉన్నట్లు అభినయిస్తూ 'పండ్లు, పూలు, కూరగాయలు' అని చెబుతూ వృత్తంలోపల చుట్టూ తిరగాలి. అలా తిరుగుతూ ఎవరి వద్దకు వచ్చి ఆగి పండ్లు అంటే ఆ విద్యార్థి ఒక పండు పేరు చెప్పాలి. అలాగే పూలు, కూరగాయలు అన్నప్పుడు వాటి పేరు చెప్పాలి. ఒకసారి చెప్పిన పేరు మరియొక్కరు చెప్పక వేరే పేరు చెప్పాలి.
- అలా చెప్పకపోయిన లేదా ఒక దాని బదులు మరొక పేరు (పండుకు బదులు పువ్వు / కూరగాయలు పేరు) చెప్పినా ఆ పిల్లవాడు బుట్టను తన తలపై పెట్టుకొని అమ్ముతూ తిరగాలి. ఇలా ఆటను కొనసాగించాలి.

## 17.కళ్ళగంతలు

- పెద్ద వలయాన్ని గీయాలి.
- ఒక విద్యార్థికి కళ్ళ గంతలు కట్టాలి. మిగతా విద్యార్థులందరూ వలయంలోపల తిరుగుతుండాలి.
- గంతలు గల విద్యార్థి ఎవరినైతే తాకుతాడో ఆ విద్యార్థి ఔటైనట్లు
- తప్పించుకుంటున్న విద్యార్థులు వలయాన్ని దాటకూడదని సూచించాలి.

## 18.చెప్పుకోండి చూద్దాం

- వివిధ రకాల వస్తువులను (సుమారుగా 30కి పైగా సేకరించుకోవాలి) వాటిని గదిలో ఒక మూలలో ఉంచి వాటిపై చార్టు/గుడ్డను కప్పి ఉంచాలి.
- పిల్లలను నాల్గు / ఐదు గ్రూపులుగా చేయాలి.
- మొదట  ఒక గ్రూపు వారిని పిలిచి ఆ చార్టు తీసి ఆ వస్తువులను 60 సెకనులు చూపి వెంటనే చార్టు మూసేయాలి. ఈ విధంగా అన్ని గ్రూపులు వారికి చూపాలి.

- తరువాత వారివారి గ్రూపులలో ఏమేమి చూసారో చర్చించుకోమనాలి.
- ఏ గ్రూపువారు ఎక్కువ వస్తువుల పేర్లు చెప్పగలుగుతారో వారు గెలిచినట్లు.

**Excise Games, Additional Warm-up games**

1. కూర్చోవడం, నిల్చోవడం
2. పద్ధతి ప్రకారం నిలబడడం / నడవడం / పరుగెత్తడం
3. వక్రరేఖపై నడవడం
4. వలయంలో తిరగడం
5. ముందుకు వెనుకకకు నడవడం
6. ఒంటికాలిపై నడవడం (కుంటే ఆట)
7. స్కిప్పింగ్ చేయడం
8. నిచ్చెన పై ఎక్కడం, దిగడం
9. మోకాళ్ళ మధ్య ఒక వస్తువును ఉంచి నడవడం
10. ఇటుకలపై సమతాస్థితిలో నడవడం
11. రెండువరసల ఇటుకలపై నడవడం
12. ఒంటికాలిపై నిల్చోవడం
13. వంగడం (కుడివైపుకు, ఎడమ వైపుకు)
14. మునివేళ్ళపై నిలబడడం
15. బంతిని కుడి, ఎడమలకు వేయడం

**సూచనలు**

- పైన పేర్కొన్న కృత్యాలను ఖాళీ సమయంలోగాని, అవకాశము ఉన్నప్పుడల్లా చేయించవలయును.
- ఒక్కొక్క రోజున ఒక కృత్యం రెగ్యులర్ ఆటతో పాటుగా అదనంగా చేయించవలయును.

# తరగతి సంసిద్ధతా కార్యక్రమం - గణితం

# ఉపాధ్యాయులకు సూచనలు

1) ఇవ్వబడిన మాడ్యూల్‌ను పూర్తిగా చదవాలి.

2) రోజు వారీ కార్యక్రమ నిర్వహణకు అవసరమైన వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలి.

3) కార్యక్రమ ప్రారంభానికి ముందే ఆయా తరగతులకు గణితంలో తీసుకున్న అంశాలలో విద్యార్థుల స్థాయిని అంచనావేసి నమోదు చేసుకోవాలి.

4) విద్యార్థుల స్థాయికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలి.

5) సాధ్యమైనంతవరకు ఈ కార్యక్రమమును నిర్దేశించిన సమయంలోనే పూర్తిచేయాలి.

6) ప్రాథమిక స్థాయిలో గణితం సంసిద్ధతా కార్యక్రమమును ఉదయం గం॥ 10.50 నుండి గం॥ 11.35 వరకు నిర్వహించాలి.

7) ప్రాథమికోన్నత స్థాయిలో సంసిద్ధతా కార్యక్రమమునకు వారానికి 18 పీరియడ్లు కేటాయించబడినవి. అందులో వారానికి 6 పీరియడ్లు గణితం కొరకు నిర్దేశించుకోవాలి.

8) గణితంలో నిర్ణయించిన అంశాలు ఎక్కువ మంది విద్యార్థులు సంతృప్తికరస్థాయిలో నేర్చుకొన్న తరువాతనే మిగిలిన అంశాలకు వెళ్లవలసి ఉంటుంది.

9) సంసిద్ధతా కార్యక్రమములో గణితం కొరకు నిర్దేశించిన అంశాలు నిర్దేశించిన సమయానికి ముందుగానే పూర్తయినచో అదనపు అంశాలు చేర్చుకొనవచ్చును.

10) కార్యక్రమము నిర్వహణ కొరకు ప్రత్యేక కాలనిర్ణయ పట్టిక రూపొందించుకొని ఆయా తరగతులలో ప్రదర్శించాలి.

11) ప్రతీరోజు విద్యార్థులకు ఇంటిపని ఇవ్వాలి. వారు చేసిన పనిని తరువాత రోజు పరిశీలించి అవసరమైన సూచనలు ఇవ్వాలి.

12) ఈ సంసిద్ధతా కార్యక్రమంతోపాటు రెగ్యులర్ బోధన కూడా నిర్వహించవలసి ఉంటుంది.

# మాడ్యూల్ రూపకల్పనలో పాల్గొన్నవారు

## 1. సాధారణ అంశాలు

1. ఇ.డి. మధుసూధన్‌రెడ్డి, ఎస్.ఆర్.జి - మహబూబ్‌నగర్
2. ఎస్.పి. పవన్ కుమార్, ఎస్.ఆర్.జి, తూర్పుగోదావరి
3. డా॥ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్.ఆర్.జి, మహబూబ్‌నగర్

## 2. పాఠశాల సంసిద్ధత కార్యక్రమము

1. కె. దాలినాయుడు, ఎస్.ఆర్.జి, విజయనగరం
2. ఎస్.వి. రామరాజు, ఎస్.ఆర్.జి, నల్గొండ
3. ఆర్. రాఘవయ్య, ఎస్.ఆర్.జి, ప్రకాశం
4. వి. రాజశేఖర్, ఎస్.ఆర్.జి, ఖమ్మం

## 3. తెలుగు

1. జి. దుర్గారావు, ఎస్.ఆర్.జి, కృష్ణ
2. ఆర్. శాంతికుమారి, ఎస్.ఆర్.జి, గుంటూరు
3. ఎ. నర్సింహమూర్తి, ఎస్.ఆర్.జి, వరంగల్
4. టి. రామాంజనేయులు, ఎస్.ఆర్.జి, అనంతపురం
5. యమ్. శ్రీరంగాచారి, ఎస్.ఆర్.జి, వరంగల్

## 4. గణితం

1. వి. మధు, ఎస్.ఆర్.జి, చిత్తూరు
2. ఎస్.యన్, మూర్తి, ఎస్.ఆర్.జి, కృష్ణ
3. బి. హనుమంతరావు, ఎస్.ఆర్.జి, నల్గొండ
4. వీరేశం, ఎస్.ఆర్.జి, మహబూబ్‌నగర్
5. డి. మధుసూధన్‌రెడ్డి, ఎస్.ఆర్.జి, నల్గొండ
6. డా॥ సురేష్, ఎస్.ఆర్.జి, నల్గొండ
7. హెచ్. శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.ఆర్.జి, కరీంనగర్

## 5. ఆంగ్లం

1. జి.వి.ఆర్. రాజేశ్వరి, ఎస్ఆర్.జి, రంగారెడ్డి
2. వి. విజయదుర్గ, ఎస్.ఆర్.జి, కృష్ణ
3. వి. రజిత, ఎస్ఆర్.జి, నిజామాబాద్
4. ఎ. సత్యనారాయణ, ఎస్.ఆర్.జి, వైఎస్ఆర్ కడప
5. డి. బాలు, ఎస్.ఆర్.జి, నల్గొండ
6. కె. విజయకుమార్, ఎస్.ఆర్.జి, అనంతపురం

## 6. హిందీ

1. ఎన్. హేమలత, ఎస్.ఆర్.జి, రంగారెడ్డి
2. శ్రోతి శ్రీనివాస్, ఎస్.ఆర్.జి, ఆదిలాబాద్

## ఎడిటింగ్

1. డా॥ వి. నాగేశ్వరరావు, డైరెక్టర్, SIEMAT, RVM SPO, Hyderabad (ఆంగ్లం)
2. డా॥ ఎస్. సురేష్‌బాబు, ప్రొఫెసర్, SCERT, హైద్రాబాద్, (గణితం)
3. శ్రీ. జి. వేణుగోపాల్‌రెడ్డి, ఎ.యం.ఓ, RVM SPO, Hyderabad (ఆంగ్లం)
4. డా॥ పి. వెంకటాచారి, ఎ.యం.ఓ, RVM SPO, Hyderabad (గణితం)
5. డా॥ ఎస్. ప్రసాద్‌రావు, ఎ.యం.ఓ, RVM SPO, Hyderabad (తెలుగు)
6. శ్రీ. మహ్మద్ నజీర్, అహ్మద్, ఎ.యం.ఓ, RVM SPO, Hyderabad (హిందీ)
7. శ్రీ యానాల వెంకట్‌రెడ్డి, ఎస్.ఆర్.జి, నల్గొండ (పాఠశాల సంసిద్ధత)

## ఎడిటింగ్ & సమన్వయం

**శ్రీమతి యం.వి రాజ్యలక్ష్మి**

స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్.

రాజీవ్ విద్యా మిషన్ (ఎస్.ఎస్.ఎ), ఆం. ప్ర., హైదరాబాద్

## ముఖ్య సలహాదారు

**శ్రీమతి. వి. ఉషారాణి, IAS.,**

స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్,

రాజీవ్ విద్యా మిషన్ (ఎస్.ఎస్.ఎ).

ఆంధ్ర ప్రదేశ్, హైదరాబాద్.

# సంసిద్ధతా కార్యక్రమం

(తరగతిలో కొనసాగించుటకు అవసరమైన అభ్యసన స్థాయిని సాధించుటకు
విద్యార్థి స్థాయి    ైన బోధన చేయడం)

## కార్యక్రమ ఆవశ్యకత:

ప్రతి విద్యార్థి ఒక తరగతి నుండి పై తరగతికి ప్రవేశించినపుడు ఆ తరగతిలో కొనసాగేందుకు అవసరమైన కనీస అభ్యసన స్థాయిని కలిగి ఉండాలి. ఒకవేళ ఆ స్థాయి లేకపోతే ఆ తరగతిలోని పాఠ్యాంశాలను అవగాహన చేసుకోవడం కష్టమవుతుంది. ప్రస్తుతం మన రాష్ట్రంలో వివిధ తరగతులలో చదువుతున్న విద్యార్థుల స్థాయి ఆయా తరగతులలో కొనసాగే విధంగా లేదు. మన రాష్ట్రంలో విద్యార్థుల స్థాయిలపై నిర్వహించిన వివిధ సర్వేల ఫలితాల గురించి సంక్షిప్తంగా చూద్దాం.

- NAS ( National Achievement Survey) 2012 ప్రకారం 5వ తరగతి గణితంలో దేశసగటు 251 ఉండగా, మన రాష్ట్రం 238 సగటుతో 20వ స్థానంలో ఉంది. మాతృభాషను చదవడంలో దేశసగటు 247 ఉండగా మనరాష్ట్రం 244 సగటుతో 16వ స్థానంలో ఉంది.
  దేశసగటు కంటే మాతృభాషలో చదవడం, గణిత ప్రక్రియలు చేయడం వంటి అంశాలలో రాష్ట్ర సగటు తక్కువగా ఉంది.

- ASER (Annual Status Educational Report) 2012 ప్రకారం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులలో 40.6% మంది 2వ తరగతి స్థాయి తెలుగు పాఠ్యాంశాన్ని చదవలేకపోతున్నారు. అలాగే 46% మంది రెండవ స్థాయి ఆంగ్ల పదాలు చదవలేకపోతున్నారు. గణితానికి సంబంధించి 60% తీసివేతలు, 62% భాగహారం చేయలేకపోతున్నారు.

పై నివేదికల ప్రకారం రాష్ట్రంలోని పాఠశాలల్లో పై తరగతుల్లోకి ప్రవేశించే విద్యార్థులలో ఆ తరగతిలో కొనసాగుటకు అవసరమైన కనీస అభ్యసన స్థాయి లేదని తేలింది. విద్యార్థులు తెలుగు చదవలేకపోతే ఇతర సబ్జెక్టులను చదవడం, అర్థం చేసుకోవడం కష్టం. అందుకొరకు పఠన ప్రారంభ, గణిత ప్రారంభానికి సంబంధించిన (Early Reading, Early Maths) సంసిద్ధతా కార్యక్రమాలు నిర్వహించాలని MHRD సూచించింది. అందుకు అనుగుణంగా విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రస్తుత తరగతిలో కొనసాగేందుకు అవసరమైన కనీస అభ్యసన స్థాయిని సాధించుటకు సంసిద్ధతా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నది.

## కార్యక్రమ వివరములు:

- జూన్ 12 నుండి జూన్ 30 వరకు 16 పని దినాలలో విద్యార్థులందరూ ప్రస్తుత తరగతిలో కొనసాగుటకు అవసరమైన స్థాయిని సాధించుటకు ఉద్దేశించబడిన కార్యక్రమమే సంసిద్ధతా కార్యక్రమం.
- సంసిద్ధతా కార్యక్రమంపై అవగాహన కలిగించుటకు అందరు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు మరియు 8వ తరగతి వరకు తెలుగు, ఆంగ్లం, హిందీ, గణితం బోధించే ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, డివిజినల్ స్థాయి మానిటరింగ్ బృంద సభ్యులు (DLMT), మండల రిసోర్స్ గ్రూపు సభ్యులు, మండల విద్యాశాఖాధికారులకు టెలీకాన్ఫరెన్స్ / ప్రత్యక్షపద్ధతి / పాఠశాల సముదాయ సమావేశములందు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించబడును.

## లక్ష్యాలు :

- ఒకటవ తరగతిలో చేరే విద్యార్థులను పాఠశాల వాతావరణానికి సంసిద్ధులను చేయడం.
- 2 నుండి 8 తరగతులకు చెందిన విద్యార్థులు గత తరగతులకు (Previous Classes) చెందిన తెలుగు, ఆంగ్లం, హిందీ, గణితముల యందు అవసరమైన (ముఖ్యమైన) సామర్థ్యాలు / అంశాలను సాధించి ప్రస్తుతం చదువుతున్న తరగతికి సంసిద్ధులను చేయడం
- ప్రస్తుత తరగతిలో కొనసాగుటకు అవసరమైన స్థాయిని సాధించుటకు విద్యార్థుల ***స్థాయికి తగిన బోధన*** చేయడం
- ఆనందకరంగా, ఆసక్తిదాయకంగా బోధనాభ్యసన కృత్యాలను నిర్వహించడం ద్వారా పిల్లలను పాఠశాల మరియు బోధనాభ్యసన పట్ల ఆకర్షితులను చేయడం.
- కనీస అభ్యసన స్థాయి కలిగిన విద్యార్థులకు వివిధ సబ్జెక్టులలోని అంశాలను పునశ్చరణ చేయడం ద్వారా పునర్బలనం గావించడం.

## పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలు :

- ఇల్లు/ అంగన్‌వాడి నుండి మొదటి తరగతిలో చేరిన విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయడం ద్వారా పాఠశాలకు మానసికంగా సంసిద్ధులను చేయాలి.
- బడిలో చేరిన విద్యార్థులు పూర్తికాలం బడిలో కొనసాగుటకు వీలుగా ఆహ్లాదకరంగా ఈ కార్యక్రమాలు నిర్వహించాలి.
- ఆట, మాట, పాట, కథ, సృజనాత్మక కృత్యాల ద్వారా పిల్లలకు బడి పట్ల ఆకర్షితులను చేయడం, అభ్యసనకు సిద్ధపరచడం చేయాలి.
- జూన్ 12 నుండి జూన్ 30 వరకు మొదటి 16 రోజులు ఉదయం మొదటి, రెండు పీరియడ్లు అభినయగేయాలు, మూడవ, నాల్గవ పీరియడ్లు కథలు, మధ్యాహ్నం ఐదు, ఆరో పీరియడ్లు సృజనాత్మక కృత్యాలు, ఏడవ పీరియడ్ ఆటలు ఆడించాలి.
- మొదటి రోజు నుండి కార్యక్రమం పూర్తియ్యే వరకు ప్రతి రోజు నిర్దేశించిన విధంగా పీరియడ్ల వారిగా పూర్తి సమయం పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలు నిర్వహించాలి.
- ఒకటవ తరగతి బోధించే ఉపాధ్యాయులకు ఈ పదహారు రోజులకు సరిపోయే అభినయ గేయాలు, కథలు, ఆటలు, సృజనాత్మక కృత్యాలను రూపొందించి ఇవ్వడం జరిగింది.
- అవసరమైన సందర్భాలలో మరికొన్నింటిని సేకరించి పాఠశాల సంసిద్ధతా కార్యక్రమంలో నిర్వహించాలి.
- 1వ తరగతి పాఠ్య పుస్తకం లో ఇచ్చిన సంసిద్ధతా కార్యక్రమలకు వీటిని జోడించి నిర్వహించాలి.
- జూలై 1 నుండి జూలై 15 వరకు ఉదయం మొదటి, రెండవ పీరియడ్లు తెలుగు, మూడవ పీరియడు గణితం, నాలుగవ పీరియడు ఆంగ్లం బోధించాలి. మధ్యాహ్నం ఐదో పీరియడ్ అభినయగేయాలు, ఆరో పీరియడ్ కథలు, ఏడో పీరియడ్ కృత్యాలు, ఆటలు ఆడించాలి.

## తరగతి సంసిద్ధతా కార్యక్రమాలు:

- 2 నుండి 8 తరగతుల విద్యార్థులు గత తరగతులకు నిర్ధారించిన సబ్జెక్టులలో కనీస అభ్యసన స్థాయిలను సాధించి ప్రస్తుతం చదువుతున్న తరగతులకు సంసిద్ధులుగా చేయుటకు ఈ కార్యక్రమం అమలు చేయబడుతున్నది.
- రెండు నుండి ఎనిమిదో తరగతి వరకు తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల వారీగా నిర్వహించవలసిన కృత్యాలు, మూల్యాంకనం, ఇంటిపనికి చెందిన రోజువారీ కార్యాచరణ ప్రణాళిక ఇవ్వడం జరిగింది.
- కనీస అభ్యసన స్థాయి కలిగిన విద్యార్థులకు పునశ్చరణ ద్వారా సబ్జెక్టులలోని అంశాలను పునర్బలనం చేయాలి.
- రెండవ తరగతి పాఠ్యపుస్తకం జూన్ నెల సిలబస్‌లో మొదటి తరగతి పాఠ్యాంశాల పునశ్చరణ ఉంది. కాబట్టి వాటిని కూడా అమలు చేయాలి.
- పాఠశాల సంసిద్ధతా కార్యక్రమంలోని అంశాలను అవసరమైనచో రెండవ తరగతిలో కూడా అమలు చేయాలి.

## గత సంవత్సరము కార్యక్రమంతో పోల్చినప్పుడు ప్రస్తుత విద్యా సంవత్సరం నిర్వహిస్తున్న కార్యక్రమ ప్రత్యేకతలు

- ప్రారంభ పరీక్ష, అంత్యపరీక్ష నిర్వహించవలసిన అవసరం లేదు
- 16 రోజులు మాత్రమే కార్యక్రమం ఉంటుంది.
- తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం సబ్జెక్టులు మాత్రమే తీసుకోవడం జరిగింది.
- ప్రతి సబ్జెక్టుకు సంబంధించి విద్యార్థులలో కనీసం సాధించవలసిన సామర్థ్యాలను మాత్రమే ఎన్నుకోవడం జరిగింది.
- ఇంటిపని తప్పనిసరి చేయడం జరిగింది. ప్రతిరోజు ఇంటిపని ఇవ్వాలి. మరుసటిరోజున సరిచేసి అవసరమైన చర్యలు చేపట్టాలి.
- తరగతి సంసిద్ధతా కార్యక్రమాలకు ఉదయం, రెగ్యులర్ బోధనకు మధ్యాహ్నం పీరియడ్లు కేటాయించడం జరిగింది.
- ప్రతిరోజు మూల్యాంకనం నిర్వహించేటట్లుగా కృత్య సామగ్రి ఇవ్వడం జరిగింది.
- 1 జూలై నుండి 15 జూలై వరకు 1వ తరగతికి నిర్వహించే సంసిద్ధతా కార్యక్రమాల కొరకు 16 రోజుల కొరకు ఇచ్చిన కార్యాచరణ ప్రణాళికను వినియోగించాలి.

### గమనించవలసిన అంశాలు:

- సంసిద్ధతా కార్యక్రమనికి సంబంధించి ప్రగతి నమోదు రిజిష్టరు మినహా ఇతర రికార్డులు నిర్వహించవలసిన అవసరం లేదు.
- రెగ్యులర్ బోధనకు ఆటంకం కలగకుండా కార్యక్రమం నిర్వహించుటకు వీలుగా రూపొందించబడింది.
- రోజువారీ ప్రణాళిక అన్ని సబ్జెక్టులలో ఇవ్వడం జరిగింది.

# సంసిద్ధతా కార్యక్రమం

# ప్రాథమిక తరగతుల కాల నిర్ణయ పట్టిక

## 1వ తరగతి

## 12 జూన్ నుండి 30 జూన్ వరకు

| మొదటి పీరియడ్ 9:15 –10:00 | రెండవ పీరియడ్ 10:00 –10:40 | మూడవ పీరియడ్ 10:50 –11:35 | నాల్గవ పీరియడ్ 11:35 –12:15 | | ఐదవ పీరియడ్ 1:15 –2:00 | ఆరవ పీరియడ్ 2:00 –2:40 | ఏడవ పీరియడ్ 2:50 –3:35 |
|---|---|---|---|---|---|---|---|
| అభినయ గేయాలు | అభినయ గేయాలు | కథలు | కథలు | | సృజనాత్మక కృత్యాలు | సృజనాత్మక కృత్యాలు | ఆటలు |

## 1వ తరగతి

## 1 జూలై నుండి 15 జూలై వరకు

| పాఠ్య పుస్తక బోధన (రెగ్యులర్ బోధన) | | | | భోజన విరామం | సంసిద్ధతా కార్యక్రమాలు | | |
|---|---|---|---|---|---|---|---|
| మొదటి పీరియడ్ 9:15 –10:00 | రెండవ పీరియడ్ 10:00 –10:40 | మూడవ పీరియడ్ 10:50 –11:35 | నాల్గవ పీరియడ్ 11:35 –12:15 | | ఐదవ పీరియడ్ 1:15 –2:00 | ఆరవ పీరియడ్ 2:00 –2:40 | ఏడవ పీరియడ్ 2:50 –3:35 |
| తెలుగు | తెలుగు | గణితం | ఆంగ్లం | | అభినయ గేయాలు | కథలు | సృజనాత్మక కృత్యాలు/ ఆటలు |

# సంసిద్ధతా కార్యక్రమం - కాల నిర్ణయ పట్టిక

## 2వ తరగతి

| సంసిద్ధతా కార్యక్రమం | | | | భోజన విరామం | రెగ్యులర్ బోధన (పాఠ్యపుస్తక బోధన) | | |
|---|---|---|---|---|---|---|---|
| మొదటి పీరియడ్ **9:15 –10:00** | రెండవ పీరియడ్ **10:00 –10:40** | మూడవ పీరియడ్ **10:50 –11:35** | నాల్గవ పీరియడ్ **11:35 –12:15** | | ఐదవ పీరియడ్ **1:15 –2:00** | ఆరవ పీరియడ్ **2:00 –2:40** | ఏడవ పీరియడ్ **2:50 –3:35** |
| తెలుగు | తెలుగు | గణితం | ఆంగ్లం | | తెలుగు | గణితం | ఆంగ్లం |

## 3, 4, 5వ తరగతులు

| సంసిద్ధతా కార్యక్రమం | | | | భోజన విరామం | రెగ్యులర్ బోధన (పాఠ్యపుస్తక బోధన) | | |
|---|---|---|---|---|---|---|---|
| మొదటి పీరియడ్ **9:15 –10:00** | రెండవ పీరియడ్ **10:00 –10:40** | మూడవ పీరియడ్ **10:50 –11:35** | నాల్గవ పీరియడ్ **11:35 –12:15** | | ఐదవ పీరియడ్ **1:15 –2:00** | ఆరవ పీరియడ్ **2:00 –2:40** | ఏడవ పీరియడ్ **2:50 –3:35** |
| తెలుగు | తెలుగు | గణితం | ఆంగ్లం | | తెలుగు | గణితం | ఆంగ్లం / పరిసరాల విజ్ఞానం (వారంలో 3 రోజులు ఆంగ్లం, 3 రోజులు పరిసరాల విజ్ఞానం) |

- 16 రోజుల కొరకు ప్రత్యేకంగా కాల నిర్ణయ పట్టిక అమలు చేయవలసి ఉంటుంది.
- విద్యార్థులు ఏ సబ్జెక్టులో ఎక్కువ మంది వెనుకబడి ఉన్నారో ఆ సబ్జెక్టుకు అధిక ప్రాధ్యానతనివ్వాలి. ఎక్కువ సమయం కేటాయించాలి.
- అవసరమైన సందర్భాలలో తెలుగుకు 60 నిమిషాలు, ఆంగ్లమునకు 60 నిమిషాలు, గణితమునకు 50 నిమిషాలు కేటాయించాలి.

## ప్రాథమికోన్నత తరగతుల కాల నిర్ణయ పట్టిక :

- ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో వారంలో ఉన్న 48 పీరియడ్లను క్రింద సూచించిన విధంగా విభజించుకొని బోధనాభ్యసన నిర్వహించాలి. ఇందుకు తగిన కాలనిర్ణయ పట్టిక రూపొందించుకొని అమలు చేయాలి.
- ఒకవారంలో ఉండే మొత్తం 48 పీరియడ్లలో 30 పీరియడ్లను రెగ్యులర్ పాఠ్యబోధనకు, మిగిలిన 18 పీరియడ్లను తరగతిలో కొనసాగుటకు అవసరమయ్యే అభ్యసన స్థాయి సాధనకు కేటాయించాలి.

### ప్రాథమికోన్నత స్థాయి తరగతులు కేటాయించవలసిన పీరియడ్లు

| విషయం | తరగతి సంసిద్ధత నిర్వహించవలసిన పీరియడ్లు | రెగ్యులర్ సిలబస్ బోధింవలసిన పీరియడ్లు |
|---|---|---|
| తెలుగు | 4 | 4 |
| హిందీ | 2 | 2 |
| ఆంగ్లం | 6 | 6 |
| గణితం | 6 | 6 |
| సామాన్య శాస్త్రం | - | 6 |
| సాంఘిక శాస్త్రం | - | 6 |
| **మొత్తం** | **18** | **30** |

- పై విధంగా పీరియడ్లను విభజించుకొని తాత్కాలిక కాలనిర్ణయ పట్టికను రూపొందించి ప్రతి తరగతిలో ప్రదర్శించాలి. తప్పకుండా అమలుచేయాలి.
- ఉదయం తరగతి సంసిద్ధతా కార్యక్రమాలు నిర్వహించాలి. మధ్యాహ్నం రెగ్యులర్ పాఠ్యపుస్తక బోధన చేయాలి.
- ఈ కార్యక్రమ నిర్వహణ సమయంలో డ్రాయింగ్, క్రాఫ్ట్, కంప్యూటర్ వంటి పీరియడ్లను సంసిద్ధతా కార్యక్రమమునందు నిర్ధారించిన సబ్జెక్టులకు సర్దుబాటు చేయాలి.
- రెగ్యులర్ బోధనకు ఆటంకం కలగకుండా, విద్యార్థుల స్థాయి సాధనకు అనుకూలంగా కాలనిర్ణయ పట్టిక రూపొందించుకోవాలి.
- వివిధ సబ్జెక్టులలో వివిధ స్థాయిలలో ఉన్న పిల్లల సంఖ్యను బట్టి ఆయా సబ్జెక్టులకు కాలనిర్ణయ పట్టికనందు ప్రాధాన్యతను ఇవ్వాలి. అంటే ఏ సబ్జెక్టులో ఎక్కువ మంది పిల్లలకు స్థాయి లేకుంటే ఆ సబ్జెక్టుకు ప్రాధాన్యతను ఇచ్చి ఎక్కువ పీరియడ్లను కేటాయించాలి. అవసరాన్ని బట్టి ప్రధానోపాధ్యాయులు కాలనిర్ణయ పట్టిక నందు మార్పులు చేసుకోవచ్చును.

## ఉపాధ్యాయులు తప్పక చేయవలసినవి:

- సంసిద్ధతా కార్యక్రమాలకు సంబంధించి ప్రత్యేక కాలనిర్ణయ పట్టిక తయారు చేయడం, అమలు చేయడం
- విద్యార్థుల ప్రారంభ స్థాయిని గుర్తించడం
- విద్యార్థుల స్థాయి సాధన కొరకు వ్యక్తిగత శ్రద్ధ వహించడం
- అవసరమైన బోధనాభ్యసన సామగ్రిని సమకూర్చుకోవడం
- ప్రత్యేక బోధనా వ్యూహాలను అమలు చేయడం
- విద్యార్థులకు ఇచ్చిన ఇంటిపని పై శ్రద్ధ చూపడం
- ప్రారంభస్థాయి, ప్రగతిని నమోదు చేయడం

## ప్రధానోపాధ్యాయులు తప్పక చేయవలసినవి:

- ప్రత్యేక కాలనిర్ణయ పట్టిక తయారీ
- బోధనాభ్యసన సామగ్రిని అందుబాటులో ఉంచడం
- తరగతి గది ప్రక్రియలను పరిశీలించడం
- ఇంటిపని సంబంధించి పిల్లల నోటు పుస్తకాలు పరిశీలించడం
- ప్రారంభస్థాయి, ప్రగతి నమోదు రిజిష్టరును పరిశీలించడం
- ఉపాధ్యాయులు నమోదు చేసిన ప్రగతిని తాను సొంతంగా పరిశీలించి సరిపోల్చుకోవడం.
- పాఠశాల సమయం అనంతరం ఒక గంట ప్రతి శనివారం విద్యార్థుల ప్రగతిపై సమీక్షించడం, లక్ష్యాలను నిర్దేశించడం, అవి సాధించేలా చూడడం.
- మొదటి శనివారం ప్రారంభ సమీక్ష సమావేశం నిర్వహించి కింది అంశాలు చర్చించాలి.
    - ఉపాధ్యాయులందరు మాడ్యుల్‌ను చదవడం, కార్యక్రమ అవగహన - అమలు
    - బోధనాభ్యసన సామగ్రి సమకూర్చుకోవడం.
    - ప్రగతి నమోదు రిజిష్టర్ నిర్వహించడం, ప్రారంభస్థాయి నమోదు
    - మాడ్యుల్‌లోని కృత్యాల నిర్వహణ తీరు.
- మిగిలిన రెండు శనివారాలు పై అంశాలను పరిశీలించడంతో పాటు ప్రత్యేకంగా విద్యార్థుల ప్రగతిపై సమీక్ష నిర్వహించాలి.

## విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధ:

ప్రతి సబ్జెక్టులో అంశాల వారీగా అవగాహన కల్పించవలసిన విద్యార్థులను గుర్తించి వారిని ఒక బృందంగా చేసి స్థాయికి తగిన బోధన చేయుటకు తగిన బోధనావ్యూహాలను అమలు చేయాలి.

- సంసిద్ధతా కార్యక్రమంలో ప్రతి విద్యార్థి పట్ల పూర్తి వ్యక్తిగత శ్రద్ధను చూపి అందరు విద్యార్థులు తరగతిలో కొనసాగుట కొరకు నిర్ధారించిన సామర్థ్యాలు సాధించేలా చూడాలి.
- ఎవరైనా ఒక విద్యార్థి వ్యక్తిగతంగా ఒక అంశం చేయలేకపోతే, విద్యార్థుల సంఖ్యకు ప్రాధాన్యతనీయక ఒక్క విద్యార్థి ఉన్ననూ ఆయా అంశాలలో అవగహన కల్పించాలి.
- 16 రోజులకు ప్రత్యేకంగా ప్రతి సబ్జెక్టుకు సంబంధించి ఇచ్చిన కార్యాచరణ ప్రణాళిక అమలు చేయవలసి ఉంటుంది.

## ఉపాధ్యాయుల దగ్గర ఉండవలసిన సామగ్రి:

- పాఠశాలలో అందుబాటులో ఉన్న మొత్తం సామగ్రిని బోధనాభ్యసనలో ఉపయోగించుకోవాలి. ఇంకా అవసరమైన వాటిని సేకరించుకోవాలి, రూపొందించుకోవాలి.
- వర్ణమాల, గుణింత, ఒత్తుల చార్టులు, ఫ్లాష్ కార్డులు , అగ్గిపుల్లలు, పూసల చట్రం, సంఖ్యా చార్టులు, కార్డులు, సంసిద్ధతా కార్డులు మొదలగునవి సమకూర్చుకొని బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. వీటితో బాటు పాఠశాలలో అందుబాటులో ఉన్న బోధనాభ్యసన సామగ్రి, అభ్యాసదీపికలు మరియు ప్రత్యేకంగా రూపొందించిన సామగ్రిని తప్పనిసరిగా వినియోగించాలి.
- ప్రాథమికస్థాయి వారికి గతంలో సరఫరా చేసిన సంసిద్ధతా కార్డులు, Easy English Cards, స్నేహబాల కార్డులు, బాల సాహిత్యం, వేసవి బడి మాడ్యుల్ ( 40 రోజుల కార్యాచరణ ప్రణాళిక), వివిధ కరదీపికలు, ప్రత్యేక ఆవాస శిక్షణ కేంద్రాల (ఆర్ఎస్‌టిసి) కోసం రూపొందించిన పుస్తకాలు, పూర్వతరగతులకు చెందిన పాఠ్యపుస్తకాలను తప్పనిసరిగా వినియోగించాలి.

## అమలు చేయవలసిన బోధనా వ్యూహాలు:

- ప్రతి విద్యార్థి ప్రస్తుత స్థాయిని గుర్తించి 16 రోజులలో విద్యార్థివారీగా సాధించవలసిన లక్ష్యాన్ని నిర్ధారించుకోవాలి.
    - ఉదా:- ఒక విద్యార్థికి వర్ణమాల రానట్లయితే 5 నుండి 16 రోజులలో సాధించవలసిన లక్ష్యాన్ని నిర్ధారించుకొని బోధన నిర్వహించాలి.
    - ఒక విద్యార్థికి గుణింతం వచ్చినట్లయితే 5 నుండి 16 రోజులలో సాధించవలసిన లక్ష్యాన్ని నిర్ధారించుకొని బోధన నిర్వహించాలి.
    - అలాగే గణితంలో అంకెలు రానివారి నుండి మొదలుకొని వివిధ స్థాయిలలో ఉన్నవారు 16 రోజులలో సాధించవలసిన లక్ష్యసాధనకు వీలుగా విద్యార్థివారిగా బోధన నిర్వహించాలి.
    - అంటే విద్యార్థి స్థాయికి తగిన బోధన చేయడం ద్వారా అన్ని సబ్జెక్టులలో ఆయా తరగతులలో కొనసాగుటకు అవసరమైన అభ్యసన స్థాయిని సాధించేటట్లు చూడాలి.
    - వ్యక్తిగత బోధన, ట్యుటోరియల్ పద్ధతి మాదిరిగా సమస్థాయి వారినందరిని గ్రూపులుగా చేసి బోధించడం, బృందాలుగా స్వయం అభ్యసనకు వీలు కల్పించడం వంటి అవసరమైన బోధనా వ్యూహాలను రూపొందించుకోవాలి. తద్వారా స్థాయికి తగిన బోధన నిర్వహించి తరగతిలో కొనసాగుటకు అవసరమైన అభ్యసన స్థాయిని సాధించాలి.
    - తరగతిలో అప్పటికే నిర్ధారింపబడిన స్థాయి కల్గిన విద్యార్థులను ఇతర విద్యార్థులకు సహకారం అందించేందుకు ఉపయోగించుకోవాలి.
    - తరగతి వారీ బాధ్యతలు తీసుకునే విధానం ఉన్నప్పటికీనీ ఈ కార్యక్రమ సమయంలో సబ్జెక్టు నేపథ్యం ఉన్న ఇతర ఉపాధ్యాయుల సహకారం తీసుకోవడం, వీలైతే వారికి కూడా బాధ్యతలు అప్పగించడం వంటివి చేయాలి.
    - టీచర్ తాను రూపొందించుకొన్న, అమలుచేసిన కార్యాచరణ ప్రణాళిక మరియు బోధనా వ్యూహాలను తన డైరీలో తప్పక నమోదు చేయాలి.
    - సంసిద్ధతా కార్యక్రమంనందు ఇచ్చిన వాటితో బాటు ఉపాధ్యాయులు స్వయంగా అదనపు కృత్యాలను రూపొందించుకొని అమలు చేయాలి.

- పిల్లలు ఆసక్తికరంగా పాల్గొనేటట్లు ఆనందంగా అభ్యసించేటట్లు బోధనా వ్యూహాలు ఉండాలి.
- ప్రతి విద్యార్థి తన అభ్యసన వేగానికి అనుగుణంగా నేర్చుకోవడానికి (అభ్యసించడానికి) ఉపాధ్యాయుడు తోడ్పడాలి.

**ఇంటిపని:**

- ప్రతిరోజు ప్రతి తరగతిలో ప్రతి సబ్జెక్టులో విద్యార్థులకు ఇంటిపని తప్పక ఇవ్వాలి.
- మరుసటి రోజు 10 నిమిషాలు ముందుగా ఇంటిపనిని పరిశీలించాలి. ఇంటిపని పరిశీలనాంశాల ఆధారంగా విద్యార్థులకు అవసరమైన సూచనలు ఇవ్వాలి.
- ఇంటి పని చేయని వారిపై ప్రత్యేక దృష్టి ఉంచి వారు ప్రతిరోజు చేయునట్లుగా ప్రోత్సహించాలి
- తరగతిలో ఇంటిపనికి చేసుకురాని విద్యార్థులకు కొంత సమయం కేటాయించి ఖచ్చితంగా చేయునట్టు చూడాలి.
- బోధనాభ్యసన ప్రక్రియలకు చెందిన ప్రతి సబ్జెక్టు అంశాలు విద్యార్థుల నోటుపుస్తకాలలో నమోదు కాబడి ఉండాలి. పిల్లల ఇంటిపనికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

## విద్యార్థుల స్థాయి సాధన - ప్రగతి నమోదు

- విద్యార్థులు తరగతిలో కొనసాగడానికి అవసరమయ్యే కనీస అభ్యసన స్థాయిని ఖచ్చితంగా సాధించేటట్లు ఉపాధ్యాయులు బాధ్యత వహించాలి.
- ప్రతి విద్యార్థికి సంబంధించి 16 రోజులలో సాధించిన ప్రగతి విద్యార్థులలో స్పష్టంగా కనబడాలి.
- ఒకసారి ప్రగతి సాధించిన విద్యార్థి మరల వెనుకబడినాడని చెప్పే సందర్భాలు ఉండరాదు.
- ఆలస్యంగా పాఠశాలలో చేరిన విద్యార్థుల పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించి కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలి.
- ప్రతి విద్యార్థి తప్పకుండా అన్ని సబ్జెక్టుల్లో అభ్యసన స్థాయి కలిగి ఉండాలి
- ఈ కార్యక్రమం నిర్వహించిన అనంతరం విద్యార్థులందరు చదవడం, రాయడం, గణిత సమస్యలు సాధించడం చేయగలగాలి.
- తెలుగు, గణితం, ఆంగ్లం, హిందీలకు సంబంధించి అన్ని తరగతులకు ఈ 16 రోజులు రోజువారిగా అమలు చేయవలసిన కార్యాచరణ ప్రణాళిక అందచేయడం జరుగుతుంది. దీనిని ఖచ్చితంగా అమలు చేయాలి. అవసరమైతే మరిన్ని అంశాలు రూపొందించుకోవాలి.
- సంసిద్ధతా కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ప్రారంభ స్థాయి, ప్రగతి వివరాలను నమోదు చేయాలి.
- ఈ రిజిష్టర్ విద్యా సంవత్సరం మొత్తం పాఠశాలలలో అందుబాటులో ఉండాలి. సందర్శకుల పరిశీలనార్థం ఇవ్వాలి.
- రిజిష్టర్‌ను పరిశీలించినప్పుడు తరగతిలో చేరినప్పుడు విద్యార్థులు ఉన్న స్థాయి, సంసిద్ధతా కార్యక్రమ నిర్వహణ తర్వాత సాధించిన ప్రగతి స్థాయి, ప్రస్తుత స్థాయి మొత్తం వివరంగా అర్థం కావాలి.
- రిజిష్టర్లో నమోదు చేసిన ప్రగతి విద్యార్థులను పరిశీలించినప్పుడు (పరీక్షించినప్పుడు) కూడా కనబడాలి.
- విద్యార్థి యొక్క ప్రస్తుత స్థాయిని మొదట నిర్ధారించుకోవాలి. తాను ప్రవేశించిన తరగతిలో కొనసాగుటకు అవసరమైన స్థాయి వివిధ సబ్జెక్టులలో ఏవిధంగా ఉందో పరిశీలించాలి.
- మొదటి రోజు స్థాయిని తెలుసుకొనుటకు చదివించడం, ఉక్తలేఖనం, సమస్యలు ఇచ్చి వాటిని సాధించిన విధానం పరిశీలించడం ద్వారా ప్రారంభ స్థాయిని గుర్తించి ప్రగతి నమోదు పత్రంలో నమోదు చేయాలి.
- ప్రతి తరగతిలో నిర్ధారించుకున్న సబ్జెక్టులలో ప్రతి ఐదు రోజులకు సాధించిన ప్రగతిని ఇచ్చిన నమూనా పట్టిక ఆధారంగా వివరాలు రిజిష్టర్‌లో నమోదు చేయాలి.
- ప్రతి 5 రోజులకు విద్యార్థుల ప్రగతి ఆధారంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి మిగిలిన రోజులకు లక్ష్యాలను సాధించుటకు వీలుగా ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలి.

## తెలుగు, గణితం, ఆంగ్లం, హిందీ సబ్జెక్టుల్లో విద్యార్థుల నుండి ఆశిస్తున్నవి

- తెలుగులో వర్ణమాల, గుణింతం, ద్విత్వ, సంయుక్త, సంశ్లేష అక్షరాలను గుర్తించడం, వీటితో ఏర్పడు పదాలు, వాక్యాలు చదవడం, రాయడం
- ఇచ్చిన విషయాన్ని విద్యార్థులు ధారాళంగా (తడబడకుండా గొణగకుండా) చదివి సొంతమాటల్లో చెప్పగలగడం, రాయగలగడం.
- గణితంలో సంఖ్యా భావన, చతుర్విద ప్రక్రియలకు చెందిన సమస్యలను సాధించగలగడం.
- ఇచ్చిన సమస్యను అర్థంచేసుకొని తగిన ప్రక్రియలను ఎన్నుకోవడం, సమస్యలను సాధించగలగడం
- ఆంగ్లంలో అక్షరాలను గుర్తించడం
- ఆంగ్ల పదాలు, చిన్న చిన్న వాక్యాలను చదవడం, రాయడం, మాట్లాడగలగడం.
- ఇతరులు ఆడిగినప్పుడు ఆంగ్లంలో ప్రతిస్పందించగలగడం.
- రైమ్స్ విని సొంతగా పాడగలగడం, వాక్యాలు రూపొందించగలగడం.
- హిందీలో వర్ణమాల, గుణింతాక్షరాలను గుర్తించి చదవడం, రాయడం.
- హిందీలో చిన్న, చిన్న వాక్యాలు మాట్లాడగలగడం

పై సామర్థ్యాల సాధనకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సబ్జెక్టు వారీగా, తరగతి వారీగా రూపొందించి ఇవ్వడం జరిగింది.

- తెలుగుకు సంబంధించి ప్రతి తరగతిలో కృత్యాలు వర్ణమాలతో ప్రారంభించడం జరిగింది. తరగతి వారీగా స్థాయి సాధనకు తగిన కృత్యాలు రూపొందించి ఇవ్వడం జరిగింది.
- ఆంగ్లంలో ప్రతి తరగతిలో వర్ణమాలతో ప్రారంభించి వినడం, మాట్లాడడానికి ప్రత్యేక కృత్యాలు ఇవ్వడం జరిగింది. తరగతి వారీగా స్థాయి సాధనకు తగిన కృత్యాలు రూపొందించి ఇవ్వడం జరిగింది.
- గణితంలో సంఖ్యాభావనతో ప్రారంభించి చతుర్విద ప్రక్రియలు, జ్యామితీయ భావనలను తీసుకోవడం జరిగింది. వీటి సాధనకు అవసరమయిన కృత్యాలు రూపొందించి ఇవ్వడం జరిగింది.

# సంసిద్ధతా కార్యక్రమాలు - తెలుగు

## 15 రోజుల కార్యక్రమం - తరగతి వారీ ఆశించే ఫలితాలు

| 2వ తరగతి | 3వ తరగతి | 4వ తరగతి | 5వ తరగతి |
|---|---|---|---|
| 1. వర్ణమాలలోని అక్షరాలను గుర్తించగలగడం<br>2. రెండక్షరాల, మూడక్షరాల సరళ పదాలను చదవగలగడం, రాయగలగడం.<br>3. చిత్రాల ఆధారంగా గుణింత పదాలను చదవగలగడం, రాయగలగడం, జతపరచగలగడం.<br>4. సరళ, గుణింత పదాలను ఉక్తలేఖనం రాయగలగడం. | 1. వర్ణమాల ఆధారంగా సరళ పదాలను రాయగలగడం.<br>2. చిత్రాల ఆధారంగా గుణింత పదాలను చదవగలగడం, రాయగలగడం.<br>3. చిత్రాల ఆధారంగా మహాప్రాణాక్షర పదాల పేర్లను చెప్పగలగడం, తేడాను గుర్తిస్తూ చదవగలగడం.<br>4. చిత్రాల ఆధారంగా ద్విత్వాక్షర పదాలను చదవగలగడం, పాఠ్య, పాఠ్యేతర అంశాలలోని ద్విత్వాక్షర పదాలను గుర్తించగలగడం. చదవగలగడం, రాయగలగడం.<br>5. ఉక్తలేఖనం రాయగలగడం.<br>6. చిత్రాల ఆధారంగా సంయుక్తాక్షర పదాల పేర్లు చెప్పగలగడం, చదవగలగడం.<br>7. పాఠ్యాంశాలలోని సంయుక్తాక్షర పదాలను గుర్తించగలగడం.<br>8. 3, 4 పదాలతో కూడిన చిన్న చిన్న వాక్యాలను చదవగలగడం, రాయగలగడం. | 1. వర్ణమాల ఆధారంగా పదనిర్మాణం చేయగలగడం, చదవగలగడం, రాయగలగడం.<br>2. చిత్రాల ఆధారంగా ఒత్తు పదాలను చెప్పగలగడం.<br>3. తేడాలను గుర్తిస్తూ చదవగలగడం.<br>4. పాఠ్య, పాఠ్యేతర పుస్తకాలలోని ఒత్తు పదాలను గుర్తించగలగడం, చదవగలగడం, రాయగలగడం.<br>5. పదాలలోని ఖాళీలను పూరించగలగడం, చిత్రాలను జతపరచగలగడం.<br>6. 3, 4 పదాలతో కూడిన చిన్న వాక్యాలను చదవగలగడం. | 1. వర్ణమాల ఆధారంగా పదనిర్మాణం చేయగలగడం, చదవగలగడం, రాయగలగడం.<br>2. తేడాలను గుర్తిస్తూ చదవగలగడం.<br>3. పాఠ్య, పాఠ్యేతర పుస్తకాలలోని ఒత్తు పదాలను గుర్తించగలగడం, చదవగలగడం, రాయగలగడం.<br>4. 4, 5 పదాలతో కూడిన వాక్యాలను చదవగలగడం.<br>5. రెండు, మూడు వాక్యాలతో కూడిన పేరాను చదవగలగడం, రాయగలగడం.<br>6. మైండ్ మ్యాపింగ్ ద్వారా ఇచ్చిన అంశాలపై 4, 5 వాక్యాలు చెప్పగలగడం, రాయగలగడం. |

○ ప్రతి తరగతిలోని సబ్జెక్టులలో పాఠ్యపుస్తకంలోని సిలబస్‌లో నిర్ధారించిన అంశాలను విద్యార్థుల స్థాయి / ప్రగతిని అంచనావేయుటకు ఆశించిన ఫలితాలుగా నిర్ధారించడం జరిగింది.

## 6వ తరగతి

1. వర్ణమాలలోని అక్షరాలను గుర్తించగలగడం. చదువగలగడం
2. సరళ పదాలను చదువగలగడం, రాయగలగడం
3. గుణింత పదాలను చదువగలగడం, రాయగలగడం.
4. ద్విత్వ, సంయుక్త, సంశ్లేష అక్షరాలను, పదాలను చదువగలగడం, రాయగలగడం
5. నూతన పదాలను, వాటి అర్థాలను అవగాహన చేసుకొని వివిధ సందర్భాలలో వినియోగించగలగడం.

## 7వ తరగతి

1. వర్ణమాల అక్షరాలు గుర్తించగలగడం, చదువగలగడం.
2. గుణింత అక్షరాలను / పదాలను గుర్తించగలగడం. చదువగలగడం, రాయగలగడం.
3. ఒత్తు అక్షరాలను / పదాలను చదువగలగడం. రాయగలగడం.
4. ద్విత్వ, సంయుక్త, సంశ్లేష అక్షరాలను పదాలను చదువగలగడం, రాయగలగడం.
5. నూతన పదాలను అర్థం చేసుకొని సొంత మాటల్లో రాయగలగడం.
6. లేఖలు, దరఖాస్తులు చదువగలగడం, రాయగలగడం.

## 8వ తరగతి

1. వర్ణమాల అక్షరాలను / పదాలను గుర్తించగలగడం, చదువగలగడం, రాయగలగడం.
2. గుణింతాక్షరాలను / పదాలను చదువగలగడం, రాయగలగడం.
3. ఒత్తు అక్షరాలు / పదాలను చదువగలగడం, రాయగలగడం.
4. ద్విత్వ, సంయుక్త, సంశ్లేష అక్షరాలు / పదాలను చదువగలగడం, రాయగలగడం.
5. నూతన పదాలను సందర్భోచితంగా గుర్తించి, అవగాహన చేసుకోగలగడం. వినియోగించగలగడం.
6. లేఖలకు ప్రతి లేఖలు రాయగలగడం.
7. తమ భావాలను సొంత మాటల్లో రాయగలగడం.

# సంసిద్ధతా కార్యక్రమాలు - గణితం
# 15 రోజుల కార్యక్రమం - తరగతి వారీ ఆశించే ఫలితాలు

| 2వ తరగతి | 3వ తరగతి | 4వ తరగతి | 5వ తరగతి |
|---|---|---|---|
| 1. పూర్వ గణిత భావనలు చెప్పగలగడం (ముందు, వెనుక, ఎక్కువ, తక్కువ చిన్నది - పెద్దది మొదలగునవి).<br>2. స్థానమార్పిడి లేకుండా "20" లోపు కూడికలు.<br>3. అప్పు తెచ్చుకోకుండా "20" లోపు తీసివేతలు. | 1. మూడంకెల సంఖ్యలను పోల్చగలగడం (ఆరోహణ, అవరోహణ).<br>2. విస్తరణ, సంక్షిప్తరూపంలో మూడంకెల సంఖ్యలు రాయడం.<br>3. రెండంకెల స్థానమార్పిడి కూడికలు చేయగలగడం.<br>4. అప్పు తెచ్చుకొనే రెండంకెల సంఖ్యల తీసివేతలు చేయగలగడం.<br>5. రెండంకెల సంఖ్యలను ఒక అంకె సంఖ్యతో గుణించడం.<br>6. అవర్తన వ్యవకలనం ద్వారా భాగహారం చేయడం. | 1. మూడంకెల సంఖ్యలను పోల్చగలగడం (ఆరోహణ, అవరోహణ).<br>2. విస్తరణ, సంక్షిప్త రూపంలో మూడంకెల సంఖ్యలు రాయడం<br>3. మూడంకెల సంఖ్యల స్థానమార్పిడి కూడికలు చేయగలగడం.<br>4. అప్పు తెచ్చుకొనే రెండంకెల సంఖ్యల తీసివేతలు చేయగలగడం.<br>5. రెండంకెల సంఖ్యలను ఒక అంకె సంఖ్యతో గుణించడం.<br>6. రెండంకెల సంఖ్యలను ఒక అంకె సంఖ్యతో భాగహారం చేయగలగడం. | 1. నాలుగంకెల సంఖ్యలను పోల్చగలగడం.(ఆరోహణ, అవరోహణ).<br>2. విస్తరణ - సంక్షిప్తరూపంలో నాలుగంకెల సంఖ్యలు రాయడం.<br>3. నాలుగంకెల సంఖ్యల స్థానమార్పిడి కూడికలు చేయగలగడం.<br>4. అప్పుతెచ్చుకొనే నాలుగంకెల సంఖ్యల తీసివేతలు చేయగలగడం.<br>5. రెండంకెల సంఖ్యలను రెండంకెల సంఖ్యతో గుణించడం. మూడంకెల సంఖ్యలను రెండంకెల సంఖ్యతో గుణించడం.<br>6. మూడంకెల సంఖ్యలను రెండంకెల సంఖ్యతో భాగహారం చేయగలగడం. |

## 6వ తరగతి - గణితం

1. ఐదంకెల సంఖ్యలను అక్షరాలలో రాయడం, అంకెలలో రాయడం.
2. ఐదంకెల సంఖ్యలను విస్తరణరూపం, సంక్షిప్తరూపంలో రాయడం.
3. ఐదంకెల సంఖ్యలోని వివిధ అంకెల స్థాన విలువలు చెప్పడం.
4. ఐదంకెల సంఖ్యలను పోల్చడం - పెద్ద సంఖ్య, చిన్న సంఖ్యలను గుర్తించడం.
5. ఐదంకెల సంఖ్యలను ఆరోహణ, అవరోహణ క్రమంలో రాయడం.
6. ఐదంకెల సంఖ్యలను కూడడం.
7. ఐదంకెల సంఖ్యలను తీసివేయడం.
8. ఐదంకెల సంఖ్యను రెండంకెల సంఖ్యతో గుణించడం.
9. ఐదంకెల సంఖ్యను రెండంకెల సంఖ్యతో భాగించడం.
10. 20 వరకు సంఖ్యలకు గుణిజాలు రాయడం.
11. 20 వరకు సంఖ్యలకు కారణాంకాలు రాయడం.

## 7వ తరగతి - గణితం

1. ఏడంకెల సంఖ్యలను అక్షరాలలో రాయడం, అంకెలలో రాయడం.
2. ఏడంకెల సంఖ్యలను పోల్చడం, ఆరోహణ, అవరోహణ క్రమంలో రాయడం.
3. ఐదంకెల సంఖ్యను రెండంకెల సంఖ్యతో గుణించడం, భాగించడం.
4. 50 లోపు సంఖ్యలకు కారణాంకాలు, గుణిజాలు, ప్రధాన సంఖ్యలు, సంయుక్త సంఖ్యలను రాయడం.
5. ఇచ్చిన సంఖ్యను ప్రధాన కారణాంకాల లబ్ధంగా విభజించడం.
6. క.సా.గు, గ.సా.భా సంబంధించిన సమస్యలను సాధించడం.
7. పూర్ణ సంఖ్యలను పోల్చడం, కూడిక, తీసివేతలు చేయడం.
8. భిన్నాల పరిచయం, పదజాలం, రకాలు గుర్తిస్తారు.
9. దశాంశ భిన్నాల, పరిచయం, దశాంశ బిందువు వాడకం తెలుసుకుంటారు.
10. సరళపటం, సంవృత పటం గుర్తించడం, గీయడం.
11. ఇచ్చిన రేఖాఖండాన్ని కొలవడం, ఇచ్చిన కొలతతో రేఖాఖండం గీయడం.
12. ఇచ్చిన కోణం కొలవడం, ఇచ్చిన కొలతతో కోణం గీయడం అల్ప, అధిక కోణాలను గుర్తించడం.
13. ఇచ్చిన పటాల చుట్టు కొలత, వైశాల్యాలు కనుగోనడం.

# 8వ తరగతి - గణితం

1. ఏడంకెల సంఖ్యలను అక్షరాలలో రాయడం, అంకెలలో రాయడం.
2. ఏడంకెల సంఖ్యలను పోల్చడం, ఆరోహణ, అవరోహణ క్రమంలో రాయడం.
3. ఐదంకెల సంఖ్యను రెండంకెల సంఖ్యతో గుణించడం, భాగించడం.
4. 50 లోపు సంఖ్యలకు కారణాంకాలు, గుణిజాలు, ప్రధాన సంఖ్యలు, సంయుక్త సంఖ్యలను రాయడం.
5. ఇచ్చిన సంఖ్యను ప్రధాన కారణాంకాల లబ్ధంగా విభజించడం.
6. క.సా.గు, గ.సా.భా సంబంధించిన సమస్యలను సాధించడం.
7. పూర్ణ సంఖ్యలను పోల్చడం, కూడిక, తీసివేతలు చేయడం.
8. పూర్ణసంఖ్యల గుణకారం, భాగహారం చేయడం.
9. విజాతి భిన్నాల కూడిక, తీసివేత చేయడం
10. విజాతి భిన్నాల గుణకారం, భాగహారం చేయడం.
11. సరళపటం, సంవృత పటం గుర్తించడం, గీయడం, త్రిభుజం, చతుర్భుజాలు గుర్తించడం.
12. ఇచ్చిన రేఖాఖండాన్ని కొలవడం, ఇచ్చిన కొలతతో రేఖాఖండం గీయడం.
13. ఇచ్చిన కోణం కొలవడం, ఇచ్చిన కొలతతో కోణం గీయడం, అల్ప, అధిక కోణాలను గుర్తించడం.
14. చతురస్రం, దీర్ఘచతురస్రాల చుట్టు కొలత, వైశాల్యాలు కనుగొనడం.
15. సామాన్య సమీకరణాలను సాధించడం.
16. బీజీయసమసాల కూడిక, తీసివేత చేయగలగడం.

# READINESS PROGRAMME – ENGLISH
# MINIMUM COMPETENCIES TO BE ACHIEVED AT PRIMARY LEVEL

| | CLASS | | | |
|---|---|---|---|---|
| | 2nd Class | 3rd Class | 4th Class | 5th Class |
| Class Room English | 1. Identification and articulation of Alphabet<br>2. Greetings<br>3. Rhymes | 1. Identification and articulation of Alphabet<br>2. Rhymes<br>3. Simple class room instructions | 1. Identification and articulation of alphabet, words, phrases<br>2. Rhymes, Songs with proper, rythm.<br>3. One word responses | 1. Identification and articulation of Alphabet<br>2. Listening and responding to the given class room instructions |
| Reading | 1. Picture Reading | 1. Picture interaction and description<br>2. Reading words with proper pronunciation | 1. Picture Reading<br>2. Reading through language games.<br>3. Reading small sentenses | 1. Picture Reading<br>2. Ability to read and understand |
| Writing | 1. Alphabet Practice in Four lines<br>2. Colouring<br>3. Language games based on Alphabet | 1. Alphabet<br>2. Words and phrases<br>3. Language games based on words. | 1. Alphabet<br>2. Words and phrases<br>3. Language games based on words and phrases. | 1. Alphabet<br>2. Words, phrases & sentenses<br>3. Language games, based on small sentences |

# MINIMUM COMPETENCIES TO BE ACHIEVED AT UPPER PRIMARY LEVEL

| | Class VI | Class – VII | Class – VIII |
|---|---|---|---|
| Class room English | 1. Identification and articulation of Alphabet, words, phrases and sentences.<br>2. Listening and responding to the given class room instructions<br>3. Rhymes & Poems | 1. Identification and articulation of Alphabet, words, phrases and sentences.<br>2. Participating in class room conversation<br>3. Rhymes & Poems | 1. Identification and articulation of Alphabet, words, phrases and sentences. |
| Reading | 1. Reading story lines, authentic material.<br>2. Reading and understanding small sentences. | 1. Reading a few lines from Text book.<br>2. Reading and understanding small stories. | 1. Reading small paragraphs and comprehending them.<br>2. Reading small stories and authentic material. |
| Writing | 1. Writing small sentences<br>2. Language games and puzzles.<br>3. Exercises on Vocabulury | 1. Writing few sentences<br>2. Language games and puzzles<br>3. Exercises on vocabulary | 1. Writing a few sentences on given topic.<br>2. Language games and puzzles.<br>3. Exercises on Vocabulary. |

## ప్రగతి నమోదు చేయవలసిన విధానం:

- ప్రతి సబ్జెక్టులో ప్రస్తుత తరగతిలో కొనసాగుటకు అవసరమైన కనీస అంశాలను నిర్ధారించటం జరిగింది.
- ఈ అంశాలకు 1,2,3,4,5 అని సంఖ్యలు కేటాయించడం జరిగింది.
- ప్రతి 5 రోజులకు విద్యార్థికి ఆయా సబ్జెక్టులో ఏ అంశాలు తెలుసో (1వ అంశం, 2వ అంశం) గుర్తించి ఆ అంశాలను సూచించే సంఖ్యలను ప్రగతి నమోదు రిజిష్టర్లో వేయాలి.
- ఉదాహరణ: 3వ తరగతి గణితంలో నిర్ధారించుకున్నఅంశాలు:

    1. మూడంకెల సంఖ్యలను పోల్చగలగడం (ఆరోహణ, అవరోహణ).
    2. విస్తరణ, సంక్షిప్తరూపంలో మూడంకెల సంఖ్యలు రాయడం.
    3. రెండంకెల స్థానమార్పిడి కూడికలు చేయగలగడం.
    4. అప్పు తెచ్చుకొనే రెండంకెల సంఖ్యల తీసివేతలు చేయగలగడం.
    5. రెండంకెల సంఖ్యలను ఒక **అంకె సంఖ్యతో గుణించడం.**
    6. అవర్తన వ్యవకలనం ద్వారా భాగహారం చేయడం.

- రాము అనే విద్యార్థి గణితంలో 5 రోజులలో 1, 2వ అంశాలు మొత్తం చేయగలిగితే 5 రోజులలో సాధించినవి గడిలో 1, 2 అని నమోదు చేయాలి. తర్వాతి 5 రోజులలో అంటే (10 రోజులలో) 4వ అంశం వరకు పూర్తి చేస్తే 3,4 అని నమోదు చేయాలి. ఒకవేళ ప్రగతి లేకపోతే గతంలో ఉన్న అంశాలనే నమోదు చేయాలి.
- ఒకవేళ ఆనంద్ అనే విద్యార్థి ప్రారంభస్థాయిలో 2వ అంశం వద్ద ఉండి 5 రోజులలో మూడు అంశాలు పూర్తి చేయగలిగితే 5 రోజులలో సాధించినవి అనే గడిలో 3 అని నమోదు చేసి తర్వాతి 5 రోజులలో ప్రగతి 5వ అంశం వరకు సాధిస్తే ఆ అంశం వరకు అంకెలను నమోదు చేయాలి.

ఇదేవిధంగా అన్ని తరగతులలో, ప్రతి సబ్జెక్టులో అన్ని అంశాలు సాధించేలా చూసి ఆ అంశాలకు చెందిన సంఖ్యలను ప్రగతి నమోదు రిజిష్టర్‌లో నమోదు చేయాలి.

# తరగతి సంసిద్ధతా కార్యక్రమం - ప్రగతి నమోదు పత్రం
## ప్రాథమిక తరగతులు

ఉపాధ్యాయుని పేరు:................................ పాఠశాల పేరు:..........................

తరగతి:.................................................. మండలం పేరు:........................

| క్రమ. సంఖ్య | విద్యార్థి పేరు | తెలుగు | | | | ఆంగ్లం | | | | గణితం | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | ప్రారంభస్థాయి | 5 రోజులలో సాధించినవి | 10 రోజులలో సాధించినవి | 15 రోజులలో సాధించినవి | ప్రారంభస్థాయి | 5 రోజులలో సాధించినవి | 10 రోజులలో సాధించినవి | 15 రోజులలో సాధించినవి | ప్రారంభస్థాయి | 5 రోజులలో సాధించినవి | 10 రోజులలో సాధించినవి | 15 రోజులలో సాధించినవి |
| 1 | రాము | | | | | | | | | 1 | 1,2 | 3 | |
| 2 | ఆనంద్ | | | | | | | | | 2 | 1,2, 3 | 1,2,3,4,5 | |

- ప్రగతి నమోదు రిజిష్టర్ అతి ముఖ్యమైనది. సందర్శకులు పరిశీలనకు వచ్చినప్పుడు విద్యా సంవత్సరము మొత్తం రిజిష్టరు తప్పకుండా అందుబాటులో ఉంచాలి.
- ఆలస్యంగా ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలు కూడా నమోదు చేయాలి.వారి స్థాయిని పరిశీలించి కనీస అభ్యసన స్థాయిలు సాధించేటట్లు చూడాలి.

# తరగతి సంసిద్ధతా కార్యక్రమం - ప్రగతి నమోదు పత్రం

## ప్రాథమికోన్నత స్థాయి

ఉపాధ్యాయునిపేరు:..........................................  పాఠశాల పేరు:...........................

తరగతి:.........................సబ్జెక్టు..........................  మండలం పేరు:.........................

| క్రమ. సంఖ్య | విద్యార్థి పేరు | ప్రారంభ స్థాయి | 5 రోజులలో సాధించినవి | 10 రోజులలో సాధించినవి | 15 రోజులలో సాధించినవి |
|---|---|---|---|---|---|
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |

- ప్రగతి నమోదు రిజిష్టర్ అతి ముఖ్యమైనది. సందర్శకులు పరిశీలనకు వచ్చినప్పుడు విద్యా సంవత్సరము మొత్తం రిజిష్టరు తప్పకుండా అందుబాటులో ఉంచాలి.
- ఆలస్యంగా ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలు కూడా నమోదు చేయాలి.వారి స్థాయిని పరిశీలించి కనీస అభ్యసన స్థాయిలు సాధించేటట్లు చూడాలి.

**కార్యక్రమ పర్యవేక్షణ:**

వివిధ స్థాయిలలోని అధికారులు, మానిటరింగ్ సిబ్బంది కార్యక్రమ అమలును క్రమం తప్పక పర్యవేక్షణ చేయాలి. సంసిద్ధతా కార్యక్రమం అమలు అనంతరం తరగతికి నిర్దేశించిన అభ్యసన స్థాయిని అందరు విద్యార్థులు సాధించగలగాలి.

- **పాఠశాల స్థాయి:** ప్రధానోపాధ్యాయులు క్షేత్రస్థాయి నందు గల మొదటి పర్యవేక్షక అధికారులు. కావున వీరు పాఠశాలలలో గల అందరు ఉపాధ్యాయులకు 16 రోజులలో సాధించవలసిన లక్ష్యాలను నిర్ధారించి ప్రతి 5 రోజులకు ఒకసారి ఎంతమేరకు ప్రగతి సాధించారో పరిశీలించాలి. సమీక్షించాలి.

- ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో 5 రోజులకు ఒకసారి పిల్లల ప్రగతిపై సమీక్ష నిర్వహించాలి. సమీక్షించిన అంశాలను మినిట్స్ రూపంలో ఉపాధ్యాయ సమీక్ష రిజిష్టర్లో నమోదు చేయాలి. తదుపరి అవసరమైన చర్యలు చేపట్టాలి.

- **మండల స్థాయి:** మండల విద్యాశాఖాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్లు మండలం నందలి అన్ని పాఠశాలలకు మానిటరింగ్ చేయాలి.

- యం.ఇ.ఓలు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, డి.యల్.యం.టి సభ్యులు పాఠశాలలను సందర్శించినప్పుడు ప్రతి తరగతిలో విద్యార్థుల స్థాయిని, ప్రగతిని పరిశీలించాలి.

- **డివిజినల్ స్థాయి:** ఉపవిద్యాశాఖాధికారులు, డివిజనల్ మానిటరింగ్ బృంద సభ్యులు వారి డివిజన్ పరిధిలో గల అన్ని పాఠశాలల్లో కార్యక్రమ అమలును పర్యవేక్షించాలి.

- **జిల్లా స్థాయి:** జిల్లావిద్యాశాఖాధికారి, ప్రాజెక్టు అధికారి, అకడమిక్ మానిటరింగ్ అధికారి, ఇతర సెక్టోరల్ అధికారులు మరియు వారి సహాయకులు క్రమం తప్పక అన్ని మండలాలకు సమ ప్రాధాన్యతను ఇస్తూ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలి. సక్రమ అమలుకు కృషిచేయాలి.

- జిల్లా ప్రాజెక్టు కార్యాలయం వారు ప్రతిరోజు ఒక్కొక్కరు కనీసం రెండు పాఠశాలలలోని అన్ని తరగతులలో విద్యార్థుల స్థాయి, ప్రగతిని పరిశీలించాలి.
- తరగతి గది ప్రక్రియల నిర్వహణ (Class Room Process) మరియు కార్యాచరణ ప్రణాళిక అమలు తీరును ప్రత్యక్షంగా పరిశీలించి అవసరమైన సూచనలు ఇవ్వాలి.
- సందర్శకులు తప్పకుండా పరిశీలనాంశాలను అకడమిక్ గైడెన్స్ రిజిష్టర్ నందు నమోదు చేయాలి.
- కార్యక్రమ అమలు అనంతరం మండల స్థాయి నందు ప్రధానోపాధ్యాయులతో, జిల్లా స్థాయిలో యం.ఇ.ఓ లతో సమీక్షా సమావేశాలను నిర్వహించాలి. తదుపరి కార్యాచరణ తయారు చేయాలి.

## పర్యవేక్షణలో గమనించాల్సిన అంశాలు:

- కాలనిర్ణయ పట్టిక
- విషయాల వారీగా కార్యాచరణ ప్రణాళిక అమలు (ప్రతి సబ్జెక్టు తరగతికి సంబంధించి)
- ఉపాధ్యాయుల బోధనా తీరు
- విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉపయోగిస్తున్న సామగ్రి
- విద్యార్థుల ప్రారంభస్థాయి, ప్రస్తుత స్థాయిని (ఎంతమంది విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో, ప్రతి తరగతిలో ప్రారంభంలో ఏ స్థాయిలో ఉన్నారో, ప్రస్తుతం ఏ స్థాయిలో ఉన్నారో, సాధించిన ప్రగతి) తప్పకుండా పరిశీలించాలి.
- కార్యక్రమ అమలు తర్వాత విద్యార్థులు సాధించిన ప్రగతి
- నోటు పుస్తకాలలో ఇంటిపని
- ఉపాధ్యాయుల డైరీ
- విద్యార్థుల ప్రగతి నమోదు రిజిష్టర్
- ఉపాధ్యాయ సమీక్షా సమావేశాల నిర్వహణ
- సందర్శకుల సూచనలను అమలు చేసిన విధానం